
ప్రజాశక్తి
శుక్రవారం 9 ఆగస్టు 2024 8 పేజీలు


తిరుపతి


చిత్తూరు

ప్రశాంతంగా పాఠశాల కమిటీ ఎన్నికలు

ప్రజాశక్తి - తిరుపతి, యంత్రాంగం

ఉమ్మడి చిత్తూరు జిల్లావ్యాప్తంగా పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ఏకపక్షంగా, ఏకగ్రీవంగా జరిగాయి. కొన్నిచోట్ల విద్యార్థులు సరైన సంఖ్యలో లేరన్న కారణంగా ఆయా పాఠశాలల్లో వాయిదా పడ్డాయి. ప్రభుత్వ పాఠశాలల్లో యాజమాన్య కమిటీ(ఎస్‌ఎంసీ) ఎన్నికల్ని జిల్లాలో గురువారం ప్రశాంతంగా నిర్వహించారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు తిరుపతి జిల్లాలో 2,305 పాఠశాలల్లో ఎస్‌ఎంసీ ఎన్నికలు సమర్ధవంతంగా, ప్రశాంతంగా నిర్వహించారు. డిఇఓ, ఎంఈవోలు, ప్రధానోపాధ్యాయులు, స్థానిక రెవెన్యూ అధికారుల పర్యవేక్షణలో నిర్వహించిన ఎన్నికల్లో 33,200 మంది సభ్యుల్ని ఎన్నుకున్నారు. తిరుపతి జిల్లా వ్యాప్తంగా 2,354 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 2305 పాఠశాలకు ఎన్నికలు నిర్వహించగా 1958 పాఠశాలల్లో ఏకగ్రీవంగా స్కూల్ మేనేజ్మెంట్ కమిటీలు ఎన్నికయ్యాయి. 347 పాఠశాలకు మాత్రమే ఎన్నికలు జరిగాయి. 17 స్కూల్స్ కు అనివార్య కారణాలవల్ల ఎన్నికలు నిర్వహించలేకపోయినట్లు జిల్లా విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. మూడు సెంట్రల్ స్కూల్ తో పాటు, 29 పాఠశాలల్లో ఎన్నికల్లో ఎన్రోల్మెంట్ కానట్లు తెలుస్తోంది.


డక్కిలిలో..

కమిటీల ఎన్నికలు ఇలా

ప్రతి తరగతి నుంచి ముగ్గురేసి సభ్యులను, ఇద్దరు మహిళలు తప్పనిసరిగా ఉండేలా ఎన్నుకున్నారు. ప్రతి తరగతి నుంచి ఎన్నికైన మొత్తం 15 మంది సభ్యుల్లో ఒకరిని ఛైర్మన్‌గా, మరొకరిని వైస్ ఛైర్మన్‌గా ఎన్నుకున్నారు. ఎన్నిక విధానం చేతులు ఎత్తడం లేదా చెప్పడం ద్వారా ఉంటుంది. ప్రతికూల పరిస్థితుల్లో ఏర్పడ్డ 3 చోట్ల బ్యాలెట్ ద్వారానూ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నిక అనంతరం తొలి కమిటీ సమావేశం నిర్వహించి, ఇద్దరు కో-ఆప్షన్ సభ్యులను నియమించారు.

రేణిగుంట మండలం గుత్తివారిపల్లి ఉన్నత

2లో


టీటీడీ ఫారెస్ట్ ఉద్యోగులకు...

రిస్క్ అలవెన్స్ ఇవ్వాలి: ఎస్‌డబ్ల్యుయుఎఫ్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

టిటిడి ఫారెస్టు ఉద్యోగులకు రిస్క్ అలవెన్స్ ఇవ్వాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ యునైటెడ్ ఫ్రంట్ (ఎస్‌డబ్ల్యుయుఎఫ్) గౌరవాధ్యక్షులు గోల్కొండ వెంకటేశం, ప్రధాన కార్యదర్శి కాటా గుణశేఖర్ డిమాండ్ చేశారు. ఎస్‌డబ్ల్యుయుఎఫ్ మహాసభలు పురస్కరించుకుని వారు మాట్లాడుతూ అటవీ కార్మికులు అడవిలో అగ్గిని ఆర్పడానికి వెళ్లడం రిస్క్‌తో కూడుకున్న పని అని, స్క్వాడ్ డ్యూటీలో రేయింబవళ్లు అడవిలో కాపలా కాయాల్సి ఉంటుందని, వన్యప్రాణుల వల్ల ప్రమాదం వాటిల్లే అవకాశం ఉందన్నారు. వారికి ఖచ్చితంగా రిస్క్ అలవెన్స్ కల్పించాలని ఈ సందర్భంగా తీర్మానించారు. నైట్‌డ్యూటీ అలవెన్స్‌లు, రగ్గు, శాలువా అందరికీ ఇచ్చినా, అటవీ కార్మికులకు ఇవ్వలేదన్నారు. త్వరలో జరగనున్న టిటిడి ఎంప్లాయీస్ బ్యాంకు ఎన్నికల్లో టిటిడి ఎస్‌డబ్ల్యుయుఎఫ్ ప్రకటించిన అభ్యర్థులను నైనారు పద్మనాభం, పట్నం దయాకర్, పూజారి రత్న ప్రభాకర్‌లను బలపరచాలని కోరారు.

నూతన కార్యవర్గం ఏకగ్రీవం

అధ్యక్షులుగా బి. సుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శిగా ఎస్.రాజశేఖర్ రెడ్డి, ట్రెజరర్‌గా బి.నిరంజన్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె.మురళి, ఉపాధ్యక్షులుగా టి.శ్రీనివాసులు, బి.వెంకట ముని, ఆర్గనైజింగ్ సెక్రటరీగా హేమావతి, జాయింట్ సెక్రటరీగా పి.ఈశ్వరయ్య, జై ఆనందరెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ఎ.గురవయ్య, ఎం.ఈశ్వరయ్య, జై.మార్కండేయరెడ్డి, ఎం.అశోక్‌కుమార్, కె.బాలకృష్ణ, ఎం.వెంకటేష్, పి.జ్యోతిలతో కార్యవర్గం

ప్రపంచం గర్వించే స్థాయిలో షార్

ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి)

ప్రపంచం గర్వించే స్థాయిలో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (షార్) ఎదిగిందని ఇస్రో ఛైర్మన్ సోమనాథ్ అన్నారు. మోహన్‌బాబు విశ్వ విద్యాలయంలో ప్రతిష్టాత్మక జాతీయ అంతరిక్ష దినోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా సోమనాథ్ మాట్లాడుతూ ఇంకా ఎంతో సాధించాల్సి ఉందని, అబ్దుల్‌కలాం, మాధవనాయక్ మొదలైన శాస్త్రవేత్తలను స్ఫూర్తిగా తీసుకుని తాను పరిశోధనలు చేశానన్నారు. అమెరికా నుండి ఆస్ట్రేలియా రావడానికి విమానంలో 30 గంటలు



సమయం పడుతుందని, అదే రాకెట్లో 30 నిమిషాల్లో రావడానికి ఎలన్ మాస్క్ అనే అమెరికన్ ఇంజనీర్ (టెల్స కంపెనీ) ప్రయత్నిస్తున్నాడని, అది తప్పకుండా విజయవంతం అవుతుందని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులు అడిగిన అనేక ప్రశ్నలకు ఉత్ప్రేరణ కలిగించే విధంగా సమాధానాలు చెప్పారు. మోహన్ బాబు విశ్వవిద్యాలయ కులపతి మోహన్ బాబు మాట్లాడుతూ సోమనాథ్ లాంటి వ్యక్తి భారతదేశానికి గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో ఛాన్సెలర్ మంచు విష్ణు, ఉపకులపతి నాగరాజ రామారావు, రిజిస్ట్రార్ సారథి పాల్గొన్నారు.

వయనాడ్ బాధితులకు అండగా..





2లో

శ్రీసిటీలో మెగా రక్తదాన శిబిరం

8లో

ఒబెరాయ్ హోటల్ నిర్మాణానికి స్థల పరిశీలన

8లో

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

వయనాడ్ బాధితులకు అండగా..

ప్రజాశక్తి - గూడూరు టౌన్, నాయుడుపేట

వయనాడ్ బాధితులకు అండగా ఉంటామని ప్రజలు ముందుకొస్తున్నారు. సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టిన విరాళాల సేకరణలో మంచి స్పందన కనిపిస్తోంది. గూడూరు రెండో పట్టణ ప్రాంతంలో నివాసం ఉంటున్న గూడూరు రోటరీక్లబ్ అధ్యక్షులు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి రూ.10వేలను విరాళంగా అందించారు. కోర్టుసెంటర్, నర్సింగరావుపేట ఏరియాల్లోనూ విరాళాలు సేకరించగా 13వేల 650 వచ్చింది. ఈ కార్యక్రమంలో నాయకులు పి.శ్రీనివాసులు, జోగి శివకుమార్, టి.వెంకట రామిరెడ్డి, బివి రమణయ్య, ఎస్.సురేష్, పుట్టా శంకరయ్య పాల్గొన్నారు.

నాయుడుపేటలో ఇంటింటికి వెళ్లి విరాళాలను సేకరించారు. ప్రతి ఒక్కరూ వయనాడ్ బాధితులకు అండగా నిలిచి మానవత్వం చాటుకోవాలని నాయకులు శివకవి ముకుంద పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉదయ్‌కుమార్, వరప్రసాద్, మనోజ్‌కుమార్, పోలమ్మ, రాజెమ్మ, రాగమ్మ పాల్గొన్నారు.



సీతమ్మ అన్నదానాలు నిరంతరాయం : జనసేన


ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

జనసేన ఆధ్వర్యంలో ఆంధ్రుల అన్నపూర్ణ డొక్కా సీతమ్మ స్ఫూర్తిగా అన్నదాన కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగిస్తామని ఆ పార్టీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్చార్జి వినుత కోటా అన్నారు. స్థానిక ఆర్టీసీ సర్కిల్లో నాల్గో గురువారం పేదలకు అన్నదానం నిర్వహించారు. వినుత కోటా మాట్లాడుతూ ఆంధ్రుల అన్నపూర్ణగా డొక్కా సీతమ్మ ఎంతోమంది పేదల ఆకలిని తీర్చారని కొనియాడారు. ఆమె సేవలను గుర్తిస్తూ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపు మేరకు జనసేన ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి గురువారం నిరంతరాయంగా జనసేన ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. అనంతరం 250 మంది పేదలకు అన్నదానం చేశారు. వీరమహిళలు గాయత్రి, శారద, నిర్మల పాల్గొన్నారు.

పర్యాటకానికి రూ.114 కోట్లివ్వండి : బొజ్జల

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఆధ్యాత్మిక పట్టణంగా ప్రపంచ ఖ్యాతి గడించిన శ్రీకాళహస్తిని పర్యాటకంగానూ అభివృద్ధిపరిచేందుకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ ను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కోరారు. శ్రీకాళహస్తి అభివృద్ధే లక్ష్యంగా అందుకు అవసరమైన పనులు, నిధులను సమకూర్చుకోవడంలో భాగంగా ఢిల్లీలో మకాం వేసిన బొజ్జల గురువారం కేంద్ర పర్యాటక శాఖా మంత్రి ని కలిశారు. 'ప్రసాద్' పథకం కింద శ్రీకాళహస్తిలో పర్యాటకం అభివృద్ధికి రూ.111.06 కోట్లు కావాలని విన్నవించారు. దానికి సంబంధించిన పనులు, అంచనా విలువలను మంత్రి ముందు ఉంచారు. భరద్వాజ తీర్థం నుంచి దుర్గమ్మ కొండ వరకు రోప్ వే, స్వర్ణముఖి నది కరకట్ట సుందరీ కరణ, అలయ మహాప్రాకారం పనులు ఇందులో ముఖ్యమైనవి. సానుకూలంగా స్పందించిన కేంద్ర పర్యాటక శాఖా మంత్రి పరిశీలించి నిధులు మంజూరయ్యేలా చేస్తానని హామీ ఇచ్చారు.



వార్త తరువాయి ప్రశాంతంగా పాఠశాల కమిటీ ఎన్నికలు

పాఠశాలకు ఎం.మునిభూషణ్‌ను, ఆర్‌పి అగ్రహారం పాఠశాలకు పి.సాయికుమారి అధ్యక్షులుగా ఏకగ్రీవమయ్యారు. టిడిపి నాయకులు మునస్వామి, ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం పాల్గొన్నారు. గేట్ పుత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు కెజె వేములు, ఎంఇఒ తిరుమలరాజు అధ్యక్షతన తల్లిదండ్రుల హాజరై యాజమాన్య కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఎన్‌పి శంకర్‌ను ఛైర్మన్‌గా, వైస్‌ఛైర్మన్‌గా ఎం.సలోమీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళం జిల్లా పరిషత్ హైస్కూల్ ఛైర్మన్‌గా షేక్‌భాను, వైస్‌ఛైర్మన్‌గా పి.శ్రీరాములు ఎన్నికయ్యారని ప్రధానోపాధ్యాయులు సి.కేశవులునాయుడు తెలిపారు. టిడిపి నాయకులు సురేష్‌నాయుడు, ఈశ్వరయ్యలు వారిని అభినందించారు.

దక్కిలి జిల్లా పరిషత్ హైస్కూల్లో దందోలు వెంకట రమణరెడ్డి, పొట్టెల్లా శాంతమ్మలు ఛైర్మన్, వైస్‌ఛైర్మన్‌లుగా ఏకగ్రీవమయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, దక్కిలి చంద్రారెడ్డి పాల్గొన్నారు. యర్రావారిపాలెం మోడల్ స్కూల్ ఎస్ఎంసి ఛైర్మన్‌గా ఉదయ్‌కుమార్, వైస్‌ఛైర్మన్‌గా పాదికునిస్సాలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 15మంది కమిటీ సభ్యులను ఎంపిక చేశారు. ఎంఇఒ బాలసుబ్రమణ్యం, టిడిపి మండల కన్వీనర్ దేశిరెడ్డి రఘునాథ వారిని అభినందించారు.

పిచ్చాటూరు జడ్‌పి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.గిరిప్రకాష్ అధ్యక్షతన జరిగిన ఎన్నికల్లో వినాయగంను ఛైర్మన్‌గా, ఉపాధ్యక్షులుగా పరిమళను ఎంపిక చేశారు. ఎంఇఒ హేమమాలిని వారిని అభినందించారు. వెంకటగిరి మోడల్ స్కూల్ విద్యాకమిటీ ఛైర్మన్‌గా నాగోలు గిరిధర్‌రెడ్డి ఏకగ్రీవమయ్యారు. మోడల్ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు తులసి జ్యోతి ఆధ్వర్యంలో 15 మంది విద్యా కమిటీ సభ్యులతో ఏర్పాటు చేశారు.

దొరవారిసత్రం మండల పరిధిలో 65 ప్రభుత్వ పాఠశాలలకు జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిసినట్లు ఎంఇఒ కృష్ణయ్య వెల్లడించారు. 51 ప్రాథమిక పాఠశాలలు, ఐదు ప్రాథమిక ఉన్నత పాఠశాలలు, ఆరు హైస్కూళ్లు, కెజిబివి బిసి గురుకుల పాఠశాల, ఆదర్శ పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించారు. 58 పాఠశాలల్లో ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ పదవులను ఎన్నుకున్నారు. ఏడు పాఠశాలల్లో ముఖాముఖి అభ్యర్థులు పోటీ పడడంతో ఎన్నికలు జరిగాయి. బిఎన్ కండ్రిగలో ఎంఇఒ ఆవల సుబ్రమణ్యం, ప్రధానోపాధ్యాయులు కె.రమణయ్య ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. ఛైర్మన్‌గా కె.లక్ష్మి, వైస్‌ఛైర్మన్‌గా గంధం చెంగయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టిడిపి నాయకులు సుధాకర్‌నాయుడు వారిని అభినందించారు. బాలాయపల్లి జయంపు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల మెయిన్, దళితవాడ ప్రాథమిక పాఠశాలలో




బిఎన్ కండ్రిగ ఎన్నికల్లో నేతల కటౌట్లు

వైసిపి మండలాధ్యక్షులు వెందోటి కార్తీక్‌రెడ్డికి సంబంధించిన అనుచరులే ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ పదవులు దక్కేలా చేసుకున్నారని చర్చ నడిచింది. పాఠశాలల వద్ద పోలీసు పహారా సాగింది.

రామచంద్రాపురం మండలంలో 44 ప్రాథమిక పాఠశాలలు, మూడు ప్రాథమికోన్నత, 9 జిల్లా పరిషత్ పాఠశాలలకు ఎన్నికలు జరిగాయి. నూతన ఛైర్మన్, వైస్‌ఛైర్మన్లను టిడిపి అధ్యక్షులు ఎం.తిరుమలరెడ్డి, డి.బిందుమాధవి అభినందించారు. సత్యవేడు మండలంలోని 69 ప్రభుత్వ పాఠశాలలకు గాను 67 పాఠశాలల్లో జరిగాయని ఎంఇఒ రవి తెలిపారు. చంగంబాకం, ఆంబాకం ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల అడ్మిషన్ పూర్తిగా లేకపోవడంతో ఆ రెండు పాఠశాలల్లో ఎన్నికలు నిర్వహించలేదు. 10 పాఠశాలలు ఏకగ్రీవంగానూ, ఓటింగ్ ద్వారా 57 పాఠశాలలకు ఛైర్మన్, వైస్‌ఛైర్మన్లు ఎన్నికయ్యారు. చంద్రగిరిలో 55 ప్రాథమిక, మూడు ప్రాథమికోన్నత, 11 ఉన్నత పాఠశాలలకు ఎన్నికలు జరిగాయి. కుప్పంబాదూరు ఎస్ఎంసి ఛైర్మన్‌గా ఎస్.సునీత, వైస్‌ఛైర్మన్‌గా రాజేంద్రలను ఎన్నుకున్నారు.



మంగళంలో...



యర్రావారిపాలెం మోడల్ స్కూల్లో



రామచంద్రాపురంలో...

నిరంతరాయ విద్యుత్ సరఫరానే లక్ష్యం : సిఎండి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

విద్యుత్ వినియోగదారులకు నిరంతరాయ విద్యుత్ సరఫరా చేయాలనే లక్ష్యంతో అధికారులు పని చేయాలని ఎపిఎస్‌పిడిసిఎల్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోషరావు తెలిపారు. గురువారం సంస్థ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వినియోగదారులకు సేవలందించడంలో అలసత్వాన్ని దరిచేరనీయవద్దని హెచ్చరించారు. సంస్థ పరిధిలో విద్యుత్ ప్రమాదాల నివారణకు వినియోగదారుల్లో విస్తత అవగాహన కల్పించాల్సిన అవసరం వుందన్నారు. విద్యుత్ లైన్లు, ట్రాన్స్ ఫార్మర్లకు దూరంగా వుండాలని, వర్షం కురిసే సందర్భాల్లో విద్యుత్ స్తంభాలను తాకరాదనే అంశాలపై వినియోగదారులకు అవగాహన వుండాలన్నారు. అదేవిధంగా రైతుల పొలాల్లో లూజు లైన్లను గుర్తించినట్లయితే వెంటనే విద్యుత్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. సోలార్ విద్యుత్ వినియోగంపై వినియోగదారులను చైతన్యవంతం చేయాలని కోరారు. రైతులకు వ్యవసాయ విద్యుత్ సర్వీసులను త్వరితగతిన విడుదల చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. సంస్థ పరిధిలో ట్రాన్స్ ఫార్మర్ ఫెయిల్యూర్స్‌ను తగ్గించేందుకు అధికారులు అవసరమైన చర్యలు చేపట్టాలని కోరారు. క్షేత్రస్థాయిలో ఎక్కడైనా ట్రాన్స్ ఫార్మర్లు మరమ్మతుకు గురైతే వెంటనే మార్చాలని ఆదేశించారు. ట్రాన్స్ ఫార్మర్ల ఫెయిల్యూర్స్ ఎక్కువగా వున్నట్లయితే సంబంధిత అధికారులు, సిబ్బంది పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా సంస్థ పరిధిలో సుదీర్ఘ కాలంగా పెండింగ్ వున్న విద్యుత్ బకాయిలను వసూలు చేసేందుకు అత్యధిక ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్/ ఫైనాన్స్(ఎఫ్ఎసి) వై. లక్ష్మీ నరసయ్య, డైరెక్టర్/ప్రాజెక్ట్స్ (ఎఫ్ఎసి)పి. అయూబ్ ఖాన్ పాల్గొన్నారు.

ప్రజలు సహకరిస్తే 'కోతలు' ఉండవు : విద్యుత్ ఎఇ

ప్రజాశక్తి - నాయుడుపేట

ట్రాన్స్‌ఫారాలు పెట్టేందుకు, కరెంట్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లను తొలగించేందుకు ప్రజలు అన్ని విధాలా సహకరిస్తే ఇలాంటి కరెంట్‌కోతలు ఉండవని నాయుడుపేట విద్యుత్ ఎఇ పేర్నాటి వెంకటస్వామి అన్నారు. నాయుడుపేటలో విధిస్తున్న కరెంట్ కోతలపై గురువారం 'ప్రజాశక్తి'లో కథనం ప్రచురితం అవడంపై ఆయన పై విధంగా స్పందించారు. ఇటీవల కాలంలో కరెంట్ కోతలు కొంచెం ఎక్కువగా విధిస్తున్న మాట వాస్తవమేనని, కానీ అవి కావాలని చేస్తున్న పని కాదని, వర్షాలు మొదలవుతున్నందు వల్ల ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలుగా వైర్లకు అడ్డంగా పెరిగిపోయిన చెట్లను తొలగించేందుకు, పాడైపోయిన కరెంట్ తీగలను మార్చేందుకు కరెంట్ ఆపుకుని పని చేయాల్సి వస్తుందన్నారు. నెలల తరబడి కరెంట్ బిల్లులు కట్టని వారికి లైన్లు కట్ చేయడానికి, కట్టిన తరువాత తిరిగి ఆ లైన్లు ఇచ్చేందుకు అపుడపుడు కరెంట్ ఆపాల్సి ఉంటుందన్నారు. చాలావరకు కరెంట్ వాడకం పెరిగిందని, ట్రాన్స్‌ఫారాల లోటు ఉందని, ఆ లోటును భర్తీ చేసేందుకు ప్రజల నుంచి సహకారం లభించడం లేదన్నారు. త్వరలో ఆర్ అండ్ బి వారితో మాట్లాడి ట్రాన్స్‌ఫారాలను నిర్మించి కరెంట్ కోతల నుంచి ప్రజలకు ఊరటనిస్తామన్నారు.



బుద్ధదేవ్ మృతికి సిపిఎం సంతాపం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, మాజీ పోలిట్ బ్యూరో సభ్యులు కామ్రేడ్ బుద్ధదేవ్ భట్టాచార్య (80) గురువారం ఉదయం కన్నుమూశారు. ఆయన మతికి సిపిఎం తిరుపతి జిల్లా కమిటీ ప్రగాఢ సంతాపాన్ని తెలియజేసింది. ఆయన 11 ఏళ్ల పాటు 2000 నుంచి 2011 వరకు ఆయన బెంగాల్ సీఎంగా బాధ్యతలు నిర్వర్తించారు. బుద్ధదేవ్ మరణం వామపక్ష ఉద్యమానికి తీవ్ర నష్టమని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు తెలియజేశారు.

బయో డీజిల్ అక్రమ విక్రయాలపై ఎంపి నిలదీత

తిరుపతి టౌన్ : బయో డీజిల్ అక్రమ విక్రయాలపై సమాచారం తెలుసుకొని చర్యలు తీసుకోవాలని తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి కోరారు. పార్లమెంట్ సమావేశాల్లో ఎంపీ డాక్టర్ గురుమూర్తి మాట్లాడుతూ పెట్రోలియం, పేలుడు పదార్థాల భద్రతా సంస్థ నిబంధనలు పాటించకుండా అనధికార బయో డీజిల్ విక్రయాలు జరుగుతున్నాయన్నారు. సమాధానంగా కేంద్ర పెట్రోలియం, సహజ వాయువుల శాఖా సహాయ మంత్రి సురేష్ గోపి సమాధానం ఇస్తూ దేశంలో బయోడీజిల్ పేరుతో అనధికారికంగా బయోడీజిల్‌ను విక్రయించడం, పెట్రోలియం ఉత్పత్తులను అక్రమంగా విక్రయిస్తున్నట్లు ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు ఫిర్యాదులు అందుతున్నాయని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికే 'రవాణా ప్రయోజనాల కోసం హై-స్పీడ్ డీజిల్‌తో కలపడం కోసం బయోడీజిల్ అమ్మకానికి మార్గదర్శకాలు-2019' జారీ చేసిందని తెలియజేసారు. ఈ మార్గదర్శకాలు బయోడీజిల్ విక్రయాలను నియంత్రణలో ఉంచుతాయని, బయోడీజిల్‌ను విక్రయించే రిటైల్ అవుట్‌లెట్‌లను క్రమం తప్పకుండా తనిఖీ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు అధికారం ఉంటుందని అన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పనే లక్ష్యం..

ప్రజాశక్తి - పిచ్చా టూరు: వివిధ ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడమే లక్ష్యమని పంచాయతీ కార్యదర్శుల, సర్పంచ్‌ల శిక్షణా తరగతుల రాష్ట్ర పరిశీలకులు ప్రసాద్, నాగేశ్వర రావు పేర్కొన్నారు. పిచ్చాటూరు ఎంపిడివో కార్యా లయంలో పంచాయతీ కార్యదర్శు లు, సర్పంచ్ లకు చేపట్టిన శిక్షణా తరగతులకు హైదరాబాద్ నుంచి ఎన్ఐఆర్‌డి స్టేట్ అబ్జర్వర్ ప్రసాద్, నాగేశ్వరరావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజుల శిక్షణలో ఇన్‌ఛార్జి ఎంపీడీవో రాధారాణి ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పరిశీలకులు మాట్లాడుతూ జాతీయ గ్రామీణ అభివృద్ధి మహిళలకు స్వయం ఉపాధి వ్యాపార అవకాశాలు, ప్రభుత్వ పథకాలన్నీ నైపుణ్య తతో కూడుకున్న అవగాహన కల్పించడం ముఖ్య ఉద్దేశం అన్నారు. మండలంలోని 21 గ్రామ పంచాయతీలలో గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శి లు, సర్పంచ్‌లు వీధులను శుభ్రపరిచి పిచికారీ మందులు వాడాలని సీజనల్ వ్యాధులు ప్రజలకు వ్యాపించ కుండా ఇంటి పరిశుభ్రత పాటించే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.


శిక్షణ ఇస్తున్న రాష్ట్ర పరిశీలకులు ప్రసాద్, నాగేశ్వరరావు

ఇంట్లో ఉన్న పొడి చెత్తను ఇంటి ఆవరణలో పడవేయ కుండా ప్రభుత్వం ఇచ్చిన ఇంటికి రెండు చెత్త బుట్ట ద్వారా పోగు చేసి గ్రీన్ అంబాసిడర్ కు చెత్తను అందించాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సర్పంచులు, కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

సత్య ఇన్ఫోటెక్‌పై చర్యలు తీసుకోవాలి : ఇన్‌ఛార్జి విసి

ప్రజాశక్తి - క్యాంపస్ : సత్య ఇన్ఫోటెక్ ఎన్రోల్ రద్దు చేసి యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని దళిత విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. గురువారం ఎస్వియూ ఇన్‌ఛార్జి విసి డాక్టర్ సిహెచ్ అప్పారావును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలలో సత్య ఇన్ఫోటెక్ పేరుతో అక్రమాలు చేస్తున్నారని ఆరోపించారు. తక్షణమే సత్య ఇన్ఫోటెక్ పర్మిషన్ ఇవ్వరాదని కోరారు. సత్య ఇన్ఫోటెక్ పేద విద్యార్థుల దగ్గర నుండి వేలాది రూపాయలు వసూలు చేస్తూ ఆన్లైన్ క్లాసులని చెబుతూ మోసం చేస్తున్నారన్నారు. విద్యార్థులకు ఒక్క రోజు కూడా ఆన్లైన్లో క్లాసులు చెప్పకుండా ఆరు నెలలు తర్వాత సర్టిఫికెట్ చేస్తున్నారు. విద్యార్థికి ఇంటెన్షిప్ పైన అవగాహన లేకుండా సర్టిఫికెట్ కోసం ప్రతి విద్యార్థి నుండి రూ.4వేల నుంచి 8వేల రూపాయల వసూళ్లకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటర్ షిప్ పైన అవగాహన లేకుండా బంగారు భవిష్యత్తు కోల్పోతున్నారన్నారు. తక్షణమే సత్య ఇన్ఫోటెక్ పై చర్యలు తీసుకోవాలని,


ఎస్వియూ ఇన్‌ఛార్జి విసికి వినతిపత్రం అందిస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

ప్రభుత్వ ప్రైవేటు కాలేజీలు ప్రిన్సిపాల్ కు రద్దుచేసి సమాచారం లెటర్ ల ద్వారా పంపాలని కోరారు. సత్య ఇంటెన్షిప్ ప్రోగ్రాంను రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నేతలు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సంఘాలు భారతీయ దళిత విద్యార్థి సేన వ్యవస్థాపకుడు కొండ యుగంధర్, బీడీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెడి ప్రసాద్, ఏపీ వీహెచ్ఎస్ తిరుపతి జిల్లా అధ్యక్షుడు రూకేష్, విద్యార్థి నాయకులు ముని, నరేష్, సాయి, దినేష్ పాల్గొన్నారు.

మహిళా వర్సిటీలో రక్తదాన శిబిరం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఎన్ఎస్ఎస్ విభాగం, కస్టమ్స్ ప్రివెంటివ్ విభాగం తిరుపతి వారు సంయుక్తంగా మహిళా వర్సిటీలోని ఆరోగ్య కేంద్రంలో మెగా రక్తదాన శిబిరం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని డీన్ స్టూడెంట్ అఫైర్స్ ప్రొఫెసర్ జే.కాత్యాయని, అసిస్టెంట్ కమిషనర్ కస్టమ్స్ డివిజన్ బ్రాంచ్ సి విజయ భాస్కర్ ప్రారంభించారు. రక్తదానం ప్రాముఖ్యతను, రక్తదానం ద్వారా ప్రాణదానం ఒక గొప్ప అవకాశమన్నారు. ముప్పై మంది ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్స్ రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ డా.



అనన్య, ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డా.పి. నీరజ, డా.బి.సుజాత, డా.ఎస్.శాంతి, డా. వి.భార్గవి, డా వై. సునీత, డా కె ఆర్. పద్మ, డా.బి వైశాలీ, డా హేమలేత, దివ్య పాల్గొన్నారు.

ద్రౌపది ఉత్సవాలకు పట్టు వస్త్రాల సమర్పణ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని ద్రౌపది దేవి సమేత ధర్మరాజుల బ్రహ్మోత్సవాల్లో భాగంగా అమ్మవారికి నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్ గురువారం పట్టు వస్త్రాలు సమర్పించారు. ముందు ద్రౌపదీదేవి సమేత ధర్మరాజుల ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని అక్కడి నుండి చౌటూరులో ఉన్న ద్రౌపదీదేవి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆయన వెంట పుత్తూరు పట్టణ గాలి జీవరత్నం నాయుడు, పట్టణ ప్రధాన కార్యదర్శి, ఎన్ ఎన్ ధనపాల్, ఆలయ కోవిల్ కారు సాళ్వాకం కిష్టప్ప మొదలి, రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ డిజి ధనపాల్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ బిసిఆర్ యుగంధర్, యాదవ సంఘం నాయకులు పాల్గొన్నారు.


పట్టు వస్త్రాలు తీసుకెళుతున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

టాస్క్ ఫోర్స్ డిఎస్‌పికి ఘన సత్కారం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): టాస్క్ ఫోర్సు డిఎస్పీగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన డీఎస్పీగా జి.చెంచుబాబు బదిలీపై వెళ్లనుండడంతో టాస్క్ ఫోర్స్ అధికారులు ఘనంగా సత్కరించి వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. గురువారం టాస్క్ ఫోర్స్ కార్యాలయంలో ఎస్పీ శ్రీనివాస్, టాస్క్ ఫోర్స్ అధికారులు శాలువాలు కప్పి, జ్ఞాపికలను అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ శ్రీనివాస్ మాట్లాడుతూ నాయుడుపేట సబ్ డివిజన్ డీఎస్పీగా వెళు తున్న చెంచుబాబును అభినందించారు. టాస్క్ ఫోర్సులో చెంచు బాబు సాంకేతిక పరంగా కేసులను లోతుగా పరిశీలించే విధానాన్ని అవలంబించారన్నారు. ఆపరేషన్ టీమ్ లను క్రమబద్ధీకరించి, ఎర్రచందనం స్మగ్లర్లను అడ్డుకోవడానికి ప్రణాళిక బద్ధంగా వ్యవహరించాలని ఆయన


టాస్క్‌ఫోర్సు డిఎస్‌పి చెంచుబాబును సన్మానిస్తు ఉద్యోగులు

సేవలు ఆదర్శప్రాయమన్నారు. డీఎస్పీ చెంచుబాబు మాట్లాడుతూ టాస్క్ ఫోర్సు కు తాను వచ్చిన తరువాత సాంకేతికతంగా చేపట్టాల్సిన విధానా లను క్రమబద్ధీకరించానన్నారు. ఆపరేషన్లలో తీసుకోవాల్సిన చర్యలు గురించి, స్మగ్లర్ల ఉనికిని కనుగొనేం దుకు చేపట్టాల్సిన అంశాలను బృందా లకు వివరించానని తెలిపారు. ఈ సందర్భంగా ఏసీఎఫ్ శ్రీనివాస్, ఆర్ఐలు సురేష్ కుమార్ రెడ్డి, చిరంజీవులు, కృపానంద, సీఐలు శ్రీనివాసులు, సురేష్ కుమార్ ఆర్ఎస్ఐలు పాల్గొన్నారు.

వైభవంగా మూలస్థాన ఎల్లమ్మ ఆలయ కుంబాభిషేకం

ప్రజాశక్తి -రామచంద్రపురం (చంద్రగిరి):

మూలస్థాన ఎల్లమ్మ పునః నూతన ఆలయ యంత్ర శిఖర ప్రతిష్ట సహిత శత చండీ సహిత సహస్ర కలశాభిషేక మహోత్సవంలో రెండవ రోజూ గురువారం గణపతి పూజతో కార్యక్రమం ప్రారంభమైంది. రుత్విక్కులు పుణ్యాహవచనం చేసి, పంచ గవ్య మండపారాధన నిర్వహించారు. నూతన ఆలయంలో వాస్తు దోష నివారణకు వాస్తు పూజ, వాస్తు హోమం చేశారు. వేదమంత్రాలతో చండీ హోమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని ఆయన సతీమణి సుధారెడ్డి దంపతులు సంప్రదాయ దుస్తులతో పాల్గొన్నారు. సాయంత్రం 4.30 గంటలకు సహస్ర కలశ మండప ఆరాధన, యాగశాల అర్చన చేశారు. తీర్థ ప్రసాదాలు వినియోగించారు. ఈ కార్యక్రమాలలో ఆలయ కమిటీ అధ్యక్షులు, సభ్యులు, నాయకులు కంకణధారులై సంప్రదాయ దుస్తులలో పాల్గొన్నారు. కుంబాభిషేకం మహోత్సవం సందర్భంగా ఆలయ ఆవరణను నానా విధ


పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నాని దంపతులు

పరిమళ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. వివిధ శాఖల వారు చక్కటి ఏర్పాట్లు చేశారు. భక్తులకు తాగునీటి సౌకర్యం కల్పించారు. పోలీస్ వారు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా శాంతి భద్రతలను పరివేక్షించారు.

క్రైం న్యూస్

ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శేషాచలం అటవీ పరిధి అన్నమయ్య జిల్లా సానిపాయ ప్రాంతంలో 18 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకొని ఒక స్మగ్లర్‌ను అదుపులోకి తీసు కున్నట్లు ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్ ఫోర్సు పోలీసులు తెలిపారు. టాస్క్ ఫోర్సు ఇన్‌ఛార్జి, తిరుపతి ఎస్పి ఎల్ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు టాస్క్ ఫోర్సు ఎస్పి పిశ్రీనివాస్ అధ్వర్యంలో డీఎస్పీ చెంచుబాబు సూచనల మేరకు ఆర్ఎస్ఐ వై విశ్వనాథ్ గురువారం సానిపాయ బేస్ క్యాంపు నుంచి కూంబింగ్ చేపట్టారన్నారు. గుర్రపుబాట వైపు ఉన్న వీరబల్లి అటవీ ప్రాంతంలో కూంబింగ్ కొనసాగుతుండగా రాజంపేట వీరబల్లి ఫారెస్టు బీటు పరిధిలో మాదిరెడ్డిగారిపల్లి సమీపంలో కొంత మంది వ్యక్తులు ఎర్రచందనం దుంగలను మోసుకుని వెళుతూ కనిపించారన్నారు. వారిని చుట్టుముట్టే ప్రయత్నం చేయగా టాస్క్ ఫోర్స్ పోలీసులను చూసి దుంగలను పడేసి చెట్ల పొదల మధ్య దాగి పారిపోయారన్నారు. వారిని వెంబడించి ఒక వ్యక్తిని పట్టుకున్నామని తెలిపారు. పట్టుబడ్డ స్మగ్లర్ తమిళనాడు, తిరువన్నామలై జిల్లా జమునా మత్తూరు తాలూకాకు చెందిన దొరైస్వామి (47)గా గుర్తించా మని తెలిపారు. పారిపోయిన వారి కోసం గాలిస్తున్నామన్నారు. సీఐ జి శ్రీనివాసులు కేసు దర్యాప్తు చేస్తున్నారని టాస్క్ ఫోర్స్ అధికారులు తెలిపారు.

చాట్ బాట్ ద్వారా 330 మొబైల్ ఫోన్స్ రికవరీ


రికవరీ చేసిన సెల్ ఫోన్లను చూపుతున్న చిత్తూరు ఎస్‌పి మణికంఠ చందోలు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: చాట్ బాట్ ద్వారా రూ.70 లక్షల విలువ చేసే 330 మొబైల్ ఫోన్స్ రికవరీ చేశామని చిత్తూరు ఎస్పి మణికంఠ చందోల్ తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ నెల వ్యవధిలో 330 ఫోన్స్ రికవరీ చేసిన పోలీస్ చాట్ బాట్ బృందాన్ని అభినందిం చారు. ఏడు దశల్లో నాలుగు కోట్ల 30 లక్షల విలువ చేసే మొబైల్ ఫోన్స్‌ను రికవరీ చేశారని తెలిపారు. మొబైల్ ట్రాకింగ్ పై పోలీసు సిబ్బంది కృషిని అభినందించారు తెలంగాణ , కర్ణాటక , తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర నుండి మొబైల్ ఫోన్స్ రికవరీ చేసే బాధ్యతలలను అప్పగిస్తున్నామని తెలిపారు. విలువైన మొబైల్స్ పోగొట్టుకున్న బాధితులు పోలీసు యాప్ చాట్ బాట్ ద్వారా ఫిర్యాదు చేయడంతో పాటు వాట్సాప్ నెంబర్ 9440900004కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. రికవరీ చేసిన మొబైల్ ఫోన్స్‌ను పోగొట్టుకున్న వారికి అందించారు.

ఉద్యోగాల పేరిట మోసం

నిందితురాలికి రెండున్నరేళ్ల జైలు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: బాధితుల ఫిర్యాదుతో ఉద్యోగాల పేరిట మోసం చేస్తున్న ఓ మహిళను పోలీసులు అరెస్టుచేసి కోర్టుకు అప్పగించగా ఆమెకు జడ్జి గురువారం రెండున్నరేళ్లు జైలు శిక్షను విధించారు. శ్రీకాకుళం జిల్లా సీతంపేటకు చెందిన నిర్మల(36) ఉద్యోగాలెప్పిస్తానంటూ నిరుద్యోగ యువతి యువకు లను మోసం చేసి డబ్బులు కాజేస్తోందంటూ చిత్తూరు పట్టణ క్రైమ్ పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఫిర్యాదు చేశారు. నిందితురాలు నిర్మలపై 3-2030 యుఎస్ 420 క్రైమ్ నెంబర్ 388 నమోదు చేసి అప్పటి క్రైమ్ సీఐ ఉమామహేశ్వరరావు దర్యాప్తు ప్రారంభించారు. ఉద్యోగాల పేరిట యువతి యువకులను మోసం చేస్తున్న నిర్మలను అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. ఈ కేసు లో గురువారం ఐదవ అడిషనల్ జడ్జి కీర్తన తుది తీర్పు వెలువరిస్తూ నిందితురాలు నిర్మలకు రెండు సంవత్సరాల ఆరు నెలల జైలు శిక్ష ఐదువేల రూపాయల జరిమానా విధించారు. నిందితురాలు నిర్మలపై చిత్తూరు జిల్లా, శ్రీకాకుళం బాపట్ల గుంటూరు జిల్లాలో కూడా పోలీసు స్టేషన్లో కేసులు ఉన్నాయి.

డాయ్ యాప్ స్కాం నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి -పలమనేరు: డాయ్ యాప్ స్కాం నిందితుడు మెప్మా రాజేష్‌ను పోలీసులు అరెస్టు చేశారు. గురువారం పలమనేరు పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డిఎస్పీ విష్ణు రఘువీర్ కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలమనేరు మెప్మా కార్యాలయంలో కంప్యూటర్ ఆపరేటర్ గా పనిచేసే రాజేష్ తనకు వాట్సప్‌లో డాయ్ యాప్ పేరుతో వచ్చిన మెసేజ్ ద్వారా బాల సుబ్రహ్మణ్యన్, టీనా అనే ఇద్దరు పరిచయమయ్యారన్నారు. రాజేష్ వారిని కనీసం చూడకుండా గుడ్డిగా నమ్మి కార్యాలయంలో పనిచేసే వారితో పాటూ పలువురిని మోటివేట్ చేసి డాయ్ యాప్‌లో పెట్టుబడులు పెట్టించాడన్నారు. సుమారు పలమనేరు చుట్టుపక్కల వారు రూ.6 కోట్ల దాకా పెట్టుబడి పెట్టి మోసపోయారన్నారు. నిందితులు బాలసుబ్రహ్మణ్యన్, టీనా, రాజేష్ పై కేసు నమోదు చేశామన్నారు. ఈ స్కామ్ దేశ వ్యాప్తంగా వున్న కేసులను విచారిస్తున్నామని డిఎస్పీ తెలిపారు. కాగా డాయ్ స్కామ్‌లో పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టించారనే కారణంగా కలెక్టర్ 19 మంది మెప్మా సిబ్బందిని ఇప్పటికే విధుల నుండి తొలగించారు.


పోలీసుల అదుపులో నిందితుడు

రక్తదానం ప్రాణదానం : ప్రిన్సిపల్

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం, కేంద్ర జిఎస్టి, కస్టమ్స్ విభాగం, తిరుపతి వారి సంయుక్త ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్. టి. నారాయ ణమ్మ మాట్లాడుతూ రక్తదానం ప్రాణదాన మన్నారు. రక్తం అవసరం అయిన వారికి చేసే గొప్ప సహాయం రక్తదానం అన్నారు.

టూరిజం హబ్‌గా కుప్పంను అభివృద్ధి చేస్తాం..
కడ పిడి వికాస్ మర్మత్



ప్రజాశక్తి- కుప్పంటౌన్: కుప్పం నియోజకవర్గాన్ని టూరిజం హబ్‌గా అభివృద్ధి పరచడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు కడ (కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) పిడి వికాస్ మర్మత్ తెలిపారు. గురువారం నాయుడు ఆయన టూరిజం, రవాణా శాఖల సిబ్బందితో సమావేశమయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓవైపు బెంగళూరు మరోవైపు చెన్నై నగరాలకు మధ్యలో ఉన్న కుప్పం నియోజకవర్గంలో చూడముచ్చటైన, ఆహ్లాదకరమైన ప్రాంతాలు ఉన్నాయన్నారు. వాటిలో రామకుప్పం మండలం ననియాల ఏకొ టూరిజం, కుప్పం మండలం కంగుంది కోట, గుడిపల్లి మండలం మల్లప్ప కొండ, గుడివంక సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలతో పాటు అగస్త్య ఫౌండేషన్, కైగల్ జలపాతం ముఖ్యమైన ప్రాంతాలన్నారు. వాటిని వీక్షించడానికి ఇప్పటికే ఆంధ్ర, తమిళనాడు, కర్ణాటకల నుండి సైతం ప్రజలు వస్తున్నట్లు తెలిపారు. వారి సౌకర్యార్థం ఆయా ప్రాంతాలలో చేపట్టవలసిన కార్యక్రమాలను తెలుపుతూ వాటికి తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో టూరిజం రీజనల్ జాయింట్ డైరెక్టర్ రమణ ప్రసాద్, డీఈ శ్రీనివాసరెడ్డి, డిటిసిఓ మల్లిఖార్జున, తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు సాయం అందించిన జిమ్ దాము



ప్రజాశక్తి- కుప్పంటౌన్: కేరళ వరద బాధితుల సహాయార్థం కుప్పం పురపాలక సంఘం ఫ్లోర్ లీడర్ జిమ్ దాము తన వంతు సాయంగా రూ.5వేల ఆర్థిక సహాయాన్ని ప్రకటించారు. ఈ మొత్తాన్ని ఆయన గురువారం కుప్పం విచ్చేసిన చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌కు స్వయంగా అందజేశారు. కేరళను వరదలు ముంచేత్తుతున్నాయని, ఇందువల్ల ఎంతో మంది ప్రజలు ఇబ్బందులు పడడం తనను కలిచి వేసిందన్నారు. వారికి ఏదో విధంగా తన వంతు సాయం అందించాలన్న తపనతో తన వంతుగా చిన్నసాయాన్ని అందించినట్టు తెలిపారు. కుప్పం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి పిఎస్ మునిరత్నం, కుప్పం నియోజకవర్గ టిడిపి విస్తరణ విభాగ కమిటీ అధ్యక్షులు డాక్టర్ సురేష్‌బాబు, కుప్పం నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులు జాకీర్ అహ్మద్, మాజీ ఎంపీపీ డాక్టర్ వెంకటేష్ పాల్గొన్నారు.

పంచాయతీ విధులు, బాధ్యతలపై శిక్షణ

ప్రజాశక్తి- సోమల: గ్రామపంచాయతీ విధులు బాధ్యతలపై సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు మూడురోజుల శిక్షణా తరగతులను ప్రారంభించారు. మొదటి రోజు స్థానిక ఎంపీడీవో కార్యాలయం సమీపంలోని సమావేశ మందిరంలో సదుం ఈఓఆర్‌డి వరప్రసాద్ రెడ్డి, చౌడేపల్లి ఈఓఆర్డి కృష్ణవేణి శిక్షణ అందజేశారు. పంచాయతీరాజ్ చట్టం 1994 సెక్షన్ 45, 46 అనుసరించి పరిపాలన పారిశుధ్యం తాగునీరు అభివృద్ధి ప్రణాళికలపై జిపిడిపి 24-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏ విధమైన నిర్ణయాలు తీసుకోవాలన్న దానిపై శిక్షణ ఇచ్చారు. గ్రామ సుపరిపాలన ప్రజలకు అందాల్సిన సౌకర్యాలు చేపట్టవలసిన బాధ్యతలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించి మరింత అభివృద్ధిలో పంచాయతీలను తీసుకువెళ్లేందుకు శిక్షణా కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని సోమల ఇన్చార్జి ఎంపీడీవో లక్ష్మీదేవి అన్నారు.

నివాస ప్రాంతాల్లో ఇటుక బట్టీలు

- అనారోగ్యానికి గురవుతున్న స్థానికులు
- అధికారులను బెదిరిస్తున్న నిర్వాహకుడు
- జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్

ప్రజాశక్తి-విజయపురం: మండలంలోని గొల్లకండ్రిగ గ్రామనివాస ప్రాంతంలో స్థానికంగా ఉన్న ఓ వ్యక్తి ఏకంగా ఇటుక బట్టిలు ఏర్పాటు చేశారు. ఇటుక బట్టీలకు వాడే మట్టి సిమెంట్ రోడ్డు కనబడకుండా మూసేంది. అంతే కాకుండా స్థానికులు వాడే నీరు, వర్షపు నీరు బయట వెళ్లడానికి వీలు లేకుండా బట్టీలు ఏర్పాటు చేశాడు. దీంతో చుట్టు పక్కల వర్షపు నీరు నిలిచి పాచిపట్టి ఉంది. ఇదేమి అని ప్రశ్నిస్తున్న ప్రజలు, అధికారులను ఆ వ్యక్తి బెదిరిస్తున్నట్లు తెలిసింది.

అనారోగ్యానికి గురవుతున్న ప్రజలు

ప్రజలు నివాసం మధ్య ఇటుక బట్టీలు ఏర్పాటు చేయడంతో స్థానిక ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు. అంతేకాకుండా ఆ చుట్టు పక్కల నివాసం ఉన్న వారు తరచూ జ్వరంతో ఆసుపత్రి పాలవుతున్నారు. అంతే కాకుండ ఇటుక బట్టీలు కల్చేటప్పుడు దుమ్ము, పొగ గ్రామాన్ని కమ్మేస్తుందని, దీంతో ఊపిరితిత్తు వ్యాధితో బాధపడేవారు, దీర్ఘకాల వ్యాధిగ్రస్తులు తీవ్రఅనారోగ్యానికి గురవుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

సిమెంట్ రోడ్డుపై మట్టి

ఇటుక బట్టిలకు వాడే మట్టి సిమెంట్ రోడ్డుపై పెరుకుపోయింది. చిన్నపాటి వర్షానికి రోడ్డు బురదమయంగా మారుతుంది. అధికారులు బురదను తొలగించానా మళ్లీ మట్టి రోడ్డుపై చేరుతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు ఎన్నిసార్లు హెచ్చరించిన భేఖారు చేస్తున్నారని తెలిసింది. అంతే కాకుండా అధికారులను సైతం బెదిరిస్తున్నట్లు స్థానిక ఆరోపిస్తున్నారు.



జిల్లా అధికారులు చర్యలు తీసుకోవాలి

గ్రామ మధ్యలో ఇటుక బట్టీలను తొలగించి, నిర్వాహుకులపై జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. లేకుంటే గ్రామం మొత్తం అనారోగ్యానికి గురై ఆసుపత్రి పాలవడం ఖాయమంటున్నారు. ముందస్తూ చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరుతున్నారు.

స్పెషల్ ఎకనామిక్ జోన్‌గా కుప్పం

ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి
ఐదేళ్లలో 30 సంవత్సరాలకు మించిన అభివృద్ధి
సమావేశానికి గైర్హాజరైన వారికి షోకాజ్ నోటీసులు
మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్



ప్రజాశక్తి- శాంతిపురం: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన సొంత నియోజకవర్గమైన కుప్పంను స్పెషల్ ఎకనామిక్ జోన్ పరిధిలోకి తీసుకొని వచ్చి కడ (కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ) ప్రాజెక్ట్ ద్వారా అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు పట్టభద్రుల ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ వసుంధర కోదండ రెడ్డి అధ్యక్షతన జరిగిన మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ స్పెషల్ ఎకనామిక్ జోన్ ద్వారా పరిశ్రమలు ఏర్పాటు చేసి కుప్పం ప్రజలకు నిరుద్యోగులకు ఉపాధి ఉపాధి కల్పన, స్వయం ఉపాధి కల్పిస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుప్పంలో 30సంవత్సరాల్లో చేసిన అభివృద్ధికి మించిన అభివృద్ధిని చేయనున్నట్లు ఆయన తెలిపారు. ఇందుకోసం జీవో నెంబర్ 6ను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఇందులో భాగంగా 40 నుండి 50 కోట్లు కేంద్ర కృషి విజ్ఞాన కేంద్రంను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మండలాల విభజన పాఠశాలలు అభివృద్ధి, డ్రైనేజీ, రోడ్లు తదితర మౌలిక ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకుంటామన్నారు. మండలంలోని అన్ని శాఖల్లో చేపడుతున్న వివిధ కార్యక్రమాల గురించి అధికారులతో సమీక్షించారు. పట్టు పరిశ్రమశాఖ, ఉపాధి హామీ, వెలుగు డిపార్ట్మెంట్లలో చోటు చేసుకున్న అవినీతిపై విజిలెన్స్ విచారణ చేయనున్నట్లు ఆయన అన్నారు. డుమ్మా కొట్టిన ఉపాధి హామీ సిబ్బంది, ఎక్సైజ్ శాఖ వారికి షోకాజ్ నోటీసులు అందజేయాల్సిందిగా ఎంపీడీవోను ఆదేశించారు. మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈసమావేశంలో సభ్యులు లేవనెత్తిన అధికారులు కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలోని 4 మండలాలకు సంబంధించి అత్యధికంగా శాంతిపురం మండలం నుంచి 50 శాతం రెవెన్యూ సమస్యలకు సంబంధించిన అర్జీలు తెలిపారు. రెవెన్యూ శాఖలో సంస్కరణలు తీసుకొని వచ్చి ప్రజలకు న్యాయం జరిగే విధంగా చేయాలని తహశీల్దార్ శివయ్యకు సూచించారు. కార్యక్రమంలో జడ్పిటిసి శ్రీనివాసులు, వైస్ ఎంపీపీలు పట్టాభి, సరస్వతి, కోఆప్షన్ సభ్యుడు నిసర్, స్థానిక సర్పంచ్ ఏవి జయరాం, ఎంపీడీవో మైథిలి పాల్గొన్నారు.

లెజెండరీ పురస్కారాలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులు



ప్రజాశక్తి- పుంగనూరు: రాజీవ్ గాంధీ, ఎన్టీఆర్, అల్లూరి సీతారామరాజు, మదర్ థెరిసా, కోడి రామకృష్ణ లెజెండరీ పురస్కారాలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా వాసులు ఎంపికయ్యారు. పీలేరుకు చెందిన అంతర్జాతీయ బహుభాషా నాటక రంగ కళాకారుడు ఖాదర్ బాష షేక్ ఎన్టీఆర్ లెజెండరీ పురస్కారానికి, అల్లూరి సీతారామరాజు లెజెండరీ పురస్కారానికి స్క్రిప్ట్ రైటర్ షేక్ గౌస్ బాష, పద్యకవి జలకనూరి మురళీధర్ రాజు, ఏఎస్ఐ దిగళ ప్రసాద్ రాజు, కోడి రామకృష్ణ సిందరి సత్యనారాయణ జర్నలిజం, కోడి రామకృష్ణ లెజెండరీ ప్రస్తారానికి మాస్ కమ్యూనికేటర్, ఫైన్ ఆర్ట్స్ కమ్యూనికేటర్ డాక్టర్ తుంగ యోగేష్ బాబు, ఆంగ్ల భాష బోధకురాలు కె.విజిత యోగేష్, యాదమర్రి పి.హెచ్.పి కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ ఏ.లక్ష్మీ నారాయణ, తిరుపతికి చెందిన చిత్ర కారిణి బత్తుల అర్చనలు మదర్ థెరీసా లెజెండరీ పురస్కారానికి ఎన్నికయ్యారు. అలాగే వై. షామీర్ రాజీవ్ గాంధీ లెజెండరీ పురస్కారాలకు ఎంపికైనట్లు పురస్కార ప్రధానోత్సవ నిర్వాహకురాలు, అభిలాష హెల్పింగ్ హ్యాండ్స్ ఆర్గనైజేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ ఎస్. సరోజనమ్మ తెలిపారు. ఈ నెల 10న హైదరాబాదు రవీంద్ర భారతిలో జరిగే అల్లూరి సీతారామరాజు శత జయంతి ఉత్సవాల్లో భాగంగా వీరు ఈ లెజెండరీ పురస్కారాలు అందుకోనున్నారు.

'కుప్పం ఆర్టీసీ డిపోను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతాం'



ప్రజాశక్తి- కుప్పంటౌన్: కుప్పం ఆర్టిసి డిపోను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని తూర్పు రాయలసీమ పట్టభద్రుల శాసనమండలి సభ్యులు, కుప్పం నియోజకవర్గ సమన్వయ కమిటీ అధ్యక్షులు డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ తెలియజేశారు. గురువారం కుప్పం – తిరుపతి ఆర్టీసీ నూతన సర్వీసును అయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్సీ మాట్లాడుతూ నారా చంద్రబాబు నాయుడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన అనంతరం కుప్పం అభివృద్ధి తిరిగి ప్రారంభమైందన్నారు. ప్రధానంగా ఆర్టీసీ డిపోను ప్రక్షాళన చేయడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాలు జారీ చేశారని తెలిపారు. ఆయన ఆదేశాల మేరకు ఇప్పటికే కుప్పం నుండి పలు ప్రాంతాలకు బస్సు సర్వీసులను ప్రారంభించడం జరిగిందన్నారు. ఇదే కోవలో ప్రస్తుతం మరో బస్సు సర్వీసును ప్రారంభించడం జరిగిందని, త్వరలో కుప్పం డిపోకు ఎలక్ట్రిక్ బస్సులను తీసుకువస్తామన్నారు. అనంతరం ఆర్టీసీ డిపో నుండి తిరుపతి గంగమ్మ గుడి వరకు ఎమ్మెల్సీ స్వయంగా బస్సును నడిపారు. కార్యక్రమంలో పురపాలక సంఘం టిడిపి అధ్యక్షుడు రాజ్ కుమార్, కౌన్సిలర్ జిమ్ దాము, నేతలు జాకీర్ అహ్మద్, డాక్టర్ వెంకటేష్, సత్యేంద్ర శేఖర్, శాంతారామ్, ఆర్టిసి డిఎం పెంచలయ్య, సీఎంఏ నరసింహులు, బలరాం పాల్గొన్నారు.

అంగన్వాడీ కేంద్రంలో తనిఖీ

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల దళితవాడలోని అంగన్వాడీ కేంద్రాన్ని ఐసిడిఎస్ సూపర్వైజర్ హరిత బుధవారం మధ్యాహ్నం తనిఖీ నిర్వహించి రికార్డులు పరిశీలించి విద్యార్థులకు అందజేస్తున్న భోజనం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని విద్యార్థులకు సక్రమంగా అందజేయాలని సిబ్బందిని ఆదేశించినట్టు తెలిపారు.



15 లోపు కంటి సమస్యలున్న వారిని గుర్తించండి

బాల్య వివాహాలను నివారించాలి: కలెక్టర్

ప్రజాశక్తి- కుప్పం టౌన్

కుప్పం నియోజకవర్గంలో ప్రతి మండలంలో ఇంటింటి సర్వే నిర్వహించి కంటి సమస్యలున్న వారి జాబితాను ఈనెల 15వ తేదీ లోపు సిద్ధం చేయాలని ఏఎన్ఎంలను జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఆదేశించారు. గురువారం కుప్పం ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో కలెక్టర్ వైద్య ఆరోగ్యశాఖపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గంలో ప్రతి ఇంటిని సర్వే చేసి కంటి సమస్యలను ఉన్నవారిని ప్రాథమికంగా గుర్తించాలని అన్నారు. ఈ సర్వే ఇప్పటికే 95 శాతం పూర్తి అయ్యిందని, ఈ నెల 15 లోపు వంద శాతం సర్వే పూర్తి చేసి జాబితాను సమర్పించాలన్నారు. తద్వారా కంటి సమస్యలు ఉన్నవారికి స్క్రీనింగ్ నిర్వహించి అవసరమైన వారికి శాస్త్ర చికిత్సలు, కంటి అద్దాల పంపిణీ కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో బాల్యవివాహాలను అరికట్టాలని, బాల్య వివాహాల ద్వారా అతి చిన్న వయసులో వారు గర్భం ధరించడం ద్వారా శారీరక సమస్యలను ఎదుర్కోవలసి ఉంటుందని, కొన్నిసార్లు మరణానికి దారి తీసే ప్రమాదం ఉందని, బాల్య వివాహాల వలన కలిగే నష్టాలను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. గర్భిణీ స్త్రీల ఆరోగ్య విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని గర్భం ధరించిన సమయం నుండి ప్రసవం అయ్యే వరకు వారి ఆరోగ్య పరిరక్షణలో ఏఎన్ఎంలు పూర్తి భాధ్యత వహించాలన్నారు. మాతా శిశుసంరక్షణపై ప్రత్యేక శ్రద్ధపెట్టి మాత శిశు మరణాలను నివారించాలన్నారు. ఈసమావేశంలో కంటి వెలుగు స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ అర్పిత, మెడికల్ ఆఫీసర్లు మునిరత్నం, డాక్టర్ సురేష్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.



ప్రతి సమస్యనూ క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

'డయల్ యువర్ ఎమ్మెల్యే'లో 34 వినతులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో ప్రజల నుంచి అందే వినతులు, ఫిర్యాదులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించేందుకు కృషిచేయాలని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ చెప్పారు. గురువారం నగరపాలక కార్యాలయంలో నిర్వహించిన డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమంలో ఎమ్మెల్యే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు. నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను ఫోన్లో ఎమ్మెల్యేకు వివరించారు. ప్రజల వినతులు, ఫిర్యాదులను ఎమ్మెల్యే విని నమోదు చేసుకున్నారు. కార్యక్రమం అనంతరం ఎమ్మెల్యే వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడారు.ఈకార్యక్రమంలో అందిన ప్రతిఒక్క వినతి, ఫిర్యాదును సంబంధిత అధికారులు పరిష్కరించాలన్నారు. గతవారం అందిన ఫిర్యాదుల్లో ఎన్ని పరిష్కరించారు? ఎన్ని పురోగతిలో ఉన్నాయని ఆరా తీశారు. రెవెన్యూ, పోలీస్, ట్రాన్స్‌కో సంబంధించిన ఫిర్యాదులు వేగంగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 34 వినతులు అందినట్లు కమిషనర్ డాక్టర్ జె.అరుణ చెప్పారు. గతవారం అందిన 45 ఫిర్యాదుల్లో 17 పరిష్కరించామని, 28 పురోగతిలో ఉన్నాయన్నారు. నగరపాలక సంస్థకు సంబంధించి 25 ఫిర్యాదుల్లో 15 ఫిర్యాదులను పరిష్కరించామని, 10 వినతులకు సంబంధించి అంచనాలు రూపొందించి తదుపరి చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.



మరింత మెరుగ్గా ఫిర్యాదులు పరిష్కారం : కమిషనర్

డయల్ యువర్ ఎమ్మెల్యే, ప్రజాసమస్యల పరిష్కార వేదిక ద్వారా అందే వినతులను మరింత మెరుగ్గా పరిష్కరించాలని కమిషనర్ డాక్టర్ జె.అరుణ నగరపాలక అధికారులను ఆదేశించారు. గురువారం మధ్యాహ్నం కమిషనర్ నగరపాలక అధికారులతో సమీక్ష నిర్వహించారు. పారిశుధ్యం, లైటింగ్, నీటి సరఫరాకు సంబంధించిన ఫిర్యాదులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వేగంగా పరిష్కరించాలన్నారు. ప్రతి ఫిర్యాదుకు సంబంధించి సమగ్ర వివరాలతో నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. గతవారం అందిన వినతుల పరిష్కారంపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో సహాయ కమిషనర్ రామకృష్ణుడు, ఎంహెచ్వో డాక్టర్ అనిల్ కుమార్ నాయక్, మేనేజర్ గోపాలకృష్ణ వర్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

జాబు కార్డుల తగ్గింపు దారుణం

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ చట్టం ద్వారా పని చేయడానికి పొందిన జాబు కార్డులను ఏకంగా 35 లక్షలు తొలగించినట్లు పార్లమెంట్‌లో కేంద్ర మంత్రి ప్రకటించడాన్ని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనిచేసే వారి సంఖ్య తగ్గిందని చెప్పి బడ్జెట్‌లో కోతపెట్టడానికి కేంద్ర ప్రభుత్వ కుట్ర దాగి వుందని విమర్శించారు. గ్రామీణ ప్రాంతంలో నివసించే ప్రతి ఒక్కరు (జమ్మూ అండ్ కాశ్మీర్ మినహా) జాబు కార్డు తీసుకోవచ్చు, కాబట్టి తక్షణమే రద్దును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ఉపాధిహామీ చట్టం వచ్చినప్పటి నుండి విభజిత ఆంధ్రప్రదేశ్‌లో 80లక్షలు జాబు కార్డులు ప్రభుత్వాలు మంజూరు చేశాయని, ఇందులో ఏ సంవత్సరం 60–70 శాతంకు మించి పనులు కల్పించలేదన్నారు. పనికోసం అర్జీలు పెట్టుకొన్నా పని చూపడం లేదన్నారు. పని చూపకపోతే వేతనంలో 50శాతం నిరుద్యోగభృతి చెల్లించాలని, రాష్ట్రంలో ఇప్పటి వరకు ఒక్కరికీ నిరుద్యోగ భృతి చెల్లించలేదని, గడిచిన 10 ఏళ్ళలో గ్రామీణ పేదల కుటుంబాలలో పిల్లలు పెద్దవారై పెళ్ళి చేసుకొని విడిగా ఉంటున్నా పాత జాబు కార్డులతోనే పని చేస్తున్నారని, గతంలో ఒక జాబ్ కార్డుపై ఇద్దరు పనిచేస్తే ప్రస్తుతం నలుగురు పనిచేయడంతో త్వరగా 100 రోజులు పూర్తవుతున్నాయని అన్నారు. 16 ఏళ్ళు నిండిన ప్రతి ఒక్కరికి జాబ్‌కార్డు ఇవ్వాలని చట్టంలోనే ఉందని, ఈచట్టాన్ని పక్కకు నెట్టి పేదలకిచ్చే నిధులకు కోత పెట్టడానికి జాబ్‌కార్డులు తగ్గించారని, కాబట్టి కార్డులను కుదించడాన్ని సిపిఎం తీవ్రంగా ఖండిస్తున్నదన్నారు.

పెరుగుతున్న డయేరియా కేసులు

గ్రామంలో వైద్యశిబిరం



ప్రజాశక్తి- బంగారుపాళ్యం: మండలం దళితవాడలో డయేరియా కేసులు పెరుగుతున్నాయని జిల్లా వైద్యాధికారి ప్రభావతి తెలిపారు. గురువారం గ్రామంలోని వైద్య శిబిరాన్ని డిఎంహెచ్ఓ పరిశీలించారు. గ్రామంలో ఎవరికన్నా అతిసార లక్షణాలు ఉంటే వైద్య శిబిరంలో చికిత్స చేసుకోవాలని పది రోజులు పాటు వైద్య శిబిరం నిరసిస్తామని తెలిపారు గ్రామంలోని త్రాగు నీటిని పరీక్షలకు పంపినట్టు అదేవిధంగా గ్రామానికి చెందిన వీరాస్వామి మృతి చెందడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అతనికి అధికంగా మద్యం సేవించడం వలన అనారోగ్యం పాలయ్యి మృతి చెందాడని గ్రామంలో నీటి ట్యాంకర్లను పరిసరాలను శుభ్రం చేసి వ్యాధి సోకకుండా మందులు పిచికారి చేస్తున్నామని అన్నారు ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉమాదేవి కృష్ణమూర్తి జిల్లా పంచాయతీ అధికారి వాణి డాక్టర్లు లోహిత్ చెంగల్ రాయలు ,రమేష్ పంచాయతీ కార్యదర్శి శంకరయ్య పలువురు ఆరోగ్య కార్యకర్తలు ఆశా వర్కర్లు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హుండీ లెక్కింపు

ప్రజాశక్తి- తవణంపల్లి: మండలంలోని శ్రీ అర్ధగిరి వీరాంజనేయ స్వామి దేవస్థానంకు సంబంధించిన 135 రోజులకు గాను హుండీలు లెక్కింపు గురువారం నిర్వహించారు. ఇందులో రూ.17,63,301లు ఆదాయం రాగా, బంగారం 11 గ్రాములు, వెండి 386 గ్రాములు, డాలర్లు 67, సౌదీ రియల్ 15, కువైట్ దినర్స్ 14 వచ్చినట్లు కార్యనిర్వహణాధికారి హనుమంత రావు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఛైర్మన్ పి.సురేంద్రరెడ్డి, దేవాదాయశాఖాధికారి మునిరాజు, సప్తగిరి గ్రామీణ బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.



చెరకు సాగులో మెళకువలు అవసరం



ప్రజాశక్తి- విజయపురం: చెరకు సాగులో మెళకువలు తెలుసుకుంటే మంచి దిగుబడితో పాటు లాభం అర్జించవచ్చు అని ఏడీ సౌభాగ్యలక్ష్మి తెలిపారు. గురువారం ఆలపాకంలో పొలబడి కార్యక్రమంలో భాగంగా వ్యవసాయాధికారులు చెరకు సాగును పరిశీలించి, రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ చెరకు నాట్లు వేసుకునేందుకు ముందు ఎకరానికి 125 కిలోల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 25 కిలోల మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌లను చెరకు చాళ్లలో వేసుకోవాలన్నారు. చెరకు ముచ్చెలు నాటిన మూడు రోజుల లోపు నేలపై ఎకరానికి రెండు కిలోల అట్రాజిన్ కలిపిన రసాయనాన్ని పిచికారీ చేసుకోవాలన్నారు. చెరకుసాగు ప్రారంభం నుండే సరైన యాజమాన్య పద్ధతులు పాటించాల్సిన అవసరం ఉందన్నారు. నేలను లోతు దుక్కి చేసి ఎకరానికి పది టన్నుల బాగా చివికిన పశువుల ఎరువును వేయాలన్నారు. చెరకు విత్తనాన్ని విత్తుకునే ముందుగా 10 శాతం సున్నపు నీటిలో ఒక గంట సమయం పాటు ఉంచుకోవాలి. దీని వల్ల మొలక శాతం, పంట నీటి ఎద్దడిని తట్టుకునే శక్తి పెరుగుతుందన్నారు. సాగు చేసే ప్రతి రైతు ఈక్రాప్ బుకింగ్ చేసుకోవాలన్నారు. సబ్సిడీ యంత్రానికి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏవో రజనికుమారి, ఆర్టికల్ అధికారి లోకేష్, రైతులు పాల్గొన్నారు.

మారుమూల గ్రామానికి బస్సు సౌకర్యం ఏర్పాటు

ప్రజాశక్తి- గుడిపల్లి: మూడు రాష్ట్రాల కూడలిలో ఉన్న గుడిపల్లి మండలంలోని ఓఎన్. కొత్తూరు గ్రామ పంచాయతీ చెందిన కొండసముద్రం అనే గ్రామానికి గురువారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆదేశాల మేరకు మాజీ జెడ్పిటిసి బెట్టప్ప నాయుడు ఆధ్వర్యంలో నూతన బస్సు సౌకర్యం కల్పించారు. దీంతో ఆ గ్రామస్తులు ఆనందంతో దశాబ్ద కాలం నుండి బస్ సౌకర్యం లేని గ్రామానికి కూడా బస్సు సౌకర్యం కల్పించడం సంతోషంగా ఉందని కృతజ్ఞతలు తెలిపారు.



అరగొండ గ్రామపంచాయతీలో

మొదటి డెంగీ కేసు నమోదు

ప్రజాశక్తి- తవణంపల్లి : మండలంలోని అరగొండ గ్రామపంచాయతీ పరిధిలో తొలి డెంగీ కేసు నమోదు అయ్యింది. పంచాయతీ ఈవో సమాచారం మేరకు బిఎల్.తేజశ్రీ (8) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదువుతుంది. ప్రస్తుతం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నది. స్థానికంగా ఉన్న పంచాయతీ పరిధిలో వాళ్ళ ఇంటిదగ్గర పారిశుద్ధ్యం పరిశుభ్రతను అవగాహన కల్పించారు.

నిరాశ్రయులకు నూతన వస్త్రాలు

దాతృత్వాన్ని చాటుకున్న హనీ ఫ్రెండ్స్ గ్రూప్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: నగరంలోని మెప్మా, నగరపాలక సంస్థ సహకారంతో సపోర్ట్ సంస్థ నిర్వహిస్తున్న నిరాశ్రయుల వసతి గృహాన్ని హనీ ఫ్రెండ్స్ గ్రూపు 30 మంది రిటైర్డ్ సిహెచ్ఓ, పిహెచ్ఎన్ సందర్శించారు. సపోర్ట్ సంస్థ అధ్యక్షులు వసతి గృహ నిర్వాహకులు పి.జోసఫ్ రాజు మాట్లాడుతూ నిరాశ్రయులకు హనీ ఫ్రెండ్స్ గ్రూప్ నూతన వస్త్రాలు, దుప్పట్లు, ప్లేట్లు, గ్లాసు అందించడం అభినందనీయమన్నారు. నిరాశ్రయుల మీద విశ్రాంతి ఉద్యోగులు ఎనలేని ప్రేమను చూపించి సేవలు అందించారన్నారు. అలాగే గ్రూప్ అడ్మిన్ ఏ. కృపావరమ్మ మాట్లాడుతూ వసతిగృహం చాలా బాగుందని జోసఫ్ రాజు సేవలు అభినందనీయమని కొనియాడారు. కేఎం.సుశీల నిరాశ్రయులకు భోజనాన్ని అందజేశారు.



'పిఎం విశ్వకర్మ యోజన' రిజిస్ట్రేషన్ చేసుకోండి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్

పిఎం విశ్వకర్మ యోజన ద్వారా లబ్ధిపొందేందుకు గ్రామ, వార్డు, సచివాలయం, సిఎస్‌సి సెంటర్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవలే పీఎం విశ్వకర్మ యోజన ప్రారంభించిందని, కేవలం 5 శాతం వడ్డీకే రూ.3లక్షల వరకు లోన్ అందించే ఈ పథకం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారని తెలిపారు. సంప్రదాయ చేతి వృత్తుల వారి కోసం కేంద్ర ప్రభుత్వం ఇటీవలే పీఎం విశ్వకర్మ యోజన అందుబాటులోకి తీసుకొచ్చిందని, సంప్రదాయ వృత్తులు చేసే, చేతి వృత్తుల్లో పనిచేసే వెనుకబడిన వర్గాల కోసం పీఎం విశ్వకర్మ స్కీమ్ పేరిట రూ.15వేల కోట్ల రూపాయలు కేటాయించారన్నారు. ఈ స్కీమ్ 2023- 24 నుంచి 2027- 28 వరకు అయిదేళ్ల పాటు అమలులో ఉంటుందని అన్నారు. ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన ద్వారా కళాకారులు, చేనేత కార్మికులకు పీఎం విశ్వకర్మ సర్టిఫికెట్‌తో పాటు గుర్తింపు కార్డును అందిస్తారని, కేవలం 5శాతం వడ్డీతో తొలి విడత కింద రూ.లక్ష వరకు, రెండో విడత కింద రూ.2 లక్షల రుణం అందిస్తారని, ఇది ఇతర లోన్లతో పోలిస్తే చాలా తక్కువని అన్నారు. చిత్తూరు జిల్లాలో టైలర్‌లు మినహా వడ్రంగి, స్వర్ణకారులు, కుమ్మరి, కమ్మరి, శిల్పులు, రాతి పని చేసే వారు, చెప్పులు తయారు చేసేవారు, మేసన్, తాపీ పని, బుట్టలు, చాపలు, చీపుర్లు, తాళ్లు అల్లేవారు, సంప్రదాయకంగా బొమ్మలు తయారు చేసేవారు, క్షురకులు, పూలదండలు చేసేవారు, లాండ్రీ , చేపల వలలు తయారు చేసేవారు, సుత్తి- పనిముట్లు తయారు చేసేవారు, తాళాలు తయారు చేసేవారు సిఎస్‌సి సెంటర్, గ్రామ, వార్డ్ సచివాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవలిసిందిగా కలెక్టర్ సుమిత్ కుమార్ సూచించారు.

తహశీల్దార్‌గా బాబు బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి - రామకుప్పం



మండల నూతన తహశీల్దార్‌గా కే.బాబు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న శ్రీధర్ పుట్టపర్తి మండలానికి బదిలీ అయ్యారు. నంద్యాల జిల్లా విధులు నిర్వహిస్తున్న కే. బాబును రామకుప్పంకు బదిలీ చేశారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అక్రమ ఇసుక, గంజాయి, బియ్యం రవాణా తదితర వాటిని అరికట్టేందుకు కృషి చేస్తామన్నారు.

ప్రశాంతంగా ఎస్‌ఎంసి ఎన్నికలు

ఏకగ్రీవంగా పాఠశాల కమిటీలు




బంగారుపాళ్యంలో..

ప్రజాశక్తి- బంగారుపాళ్యం: ప్రశాంత వాతావరణంలో ఎస్‌ఎంసి ఎన్నికలు జరిగినట్టు మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వరరావు, రమేష్ తెలిపారు. గురువారం జరిగిన పాఠశాల ఎన్నికల్లో మండలంలోని 12 ఉన్నత పాఠశాలు, 4 ప్రాథమికోన్నత పాఠశాలు, 80 ప్రాథమిక పాఠశాలు, ఒక గురుకుల పాఠశాల్లో ప్రశాంత వాతావరణంలో స్కూల్ కమిటీ చైర్మన్‌లను ఎంపిక జరిగింది. ఆయా పాఠశాలల్లో ఏకగ్రీవంగా ఎన్నికల జరగడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఎన్నికల పరిశీలకులుగా పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే గుంతూరు ప్రాథమిక పాఠశాల కమిటీ చైర్మన్‌గా జ్యోత్స్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పాఠశాల ప్రధానో పాధ్యాయులు వాసు దేవయ్య తెలిపారు. భాష్యం వంశీ చౌదరి, వీఆర్ఓ సునీల్ కుమార్, ఉపాధ్యాయులు సునీత పాల్గొన్నారు.



వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: వెదురుకుప్పం జడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు జి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్కూల్ కమిటీ ఎన్నికలు జరిగాయి. కే.మధుసూదన్ రెడ్డి, ఎం.సురేష్‌కీ మధ్య ఎన్నికలు జరుగగా కే.మధుసూదన్ రెడ్డి గెలుపొందారు. అలాగే వైస్‌ఛైర్‌పర్సన్‌గా పి.అమ్ములు ఎన్నికయ్యారు. వీరిని టిడిపి క్లస్టర్ ఇంచార్జి మాజీ ఎంపీటీసీ మోహన్ మురళి సన్మానించారు. మాంబేడు పంచాయతీ, వేణుగోపాలపురం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు గువ్వల దేశయ్య ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. కమిటీ ఛైర్‌పర్సన్‌గా జి.సౌజన్య, వైస్ ఛైర్‌పర్సన్‌గా పి.విమలను ఎన్నుకున్నారు. తూగుండ్రం ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రాజేంద్ర నాయుడు ఆధ్వర్యంలో స్కూల్ కమిటీ కమిటీ ఛైర్మన్ కే.సుధాకర్, వైస్ ఛైర్‌పర్సన్‌గా సుప్రియను ఎన్నుకున్నారు. మాజీ సర్పంచ్ నియాజ్‌అలి, మాజీ స్కూల్ కమిటీ ఛైర్మన్ జీవరత్నం, నీరజాక్షులరెడ్డి, శాంతికుమార్, శంకర్, సంపత్, రాఘవేంద్ర పాల్గొన్నారు.



రామకుప్పంలో..



యాదమరిలో..

యాదమరి మండలం దాసరాపల్లి పాఠశాల విద్యాకమిటీ ఛైర్‌పర్సన్‌గా ఎం.రీటీ, వైస్ ఛైర్‌పర్సన్‌గా ఏ.మునివరప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా తహశీల్దార్, టిటిడి జిల్లా కార్యదర్శి హేమగిరి నాయుడు, జిల్లా యువత అధ్యక్షులు గుణశేఖర్, సర్పంచ్ సుబ్రహ్మణ్యం, ప్రధానోపాధ్యాయులు సురేష్ పాల్గొన్నారు.కె.గొల్లపల్లె హైస్కూల్ ప్లస్‌లో పాఠశాల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నికైనారు. కమీటి ఛైర్మన్‌గా పెద్దపల్లి నవీన్ కుమార్, వైస్ ఛైర్‌ప్సన్‌గా ఎస్.అమనిలను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని హెచ్‌ఎం ఎపి.లలిత తెలిపారు.



కార్వేటినగరంలో..

కార్వేటినగరం: ఆర్కేఎస్‌ఆర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎస్‌ఎంసి ఎన్నికలలో స్కూల్ ఛైర్మన్‌గా షేక్ సందాని, వైస్ ఛైర్‌పర్సన్‌గా సి.సరిత ఎన్నికైనట్లు హెచ్‌ఎం.కోటేశ్వరరావు తెలిపారు. అదేవిధంగా కేఎం.పురం ఉన్నత పాఠశాలలో జరిగిన ఎన్నికలలో స్కూల్ ఛైర్మన్‌గా పట్టేం.బాలాజీ, వైస్ ఛైర్‌పర్సన్‌గా రేఖ ఎన్నికైనట్లు పాఠశాల హెచ్‌ఎం సునీత తెలిపారు. టికెఎం.పేట ఉన్నత పాఠశాలస్కూల్ ఛైర్మన్‌గా కె.వెంకట రాముడు, వైస్ ఛైర్‌పర్సన్‌గా బి.లక్ష్మీదేవి ఎన్నికైనట్లు హెచ్‌ఎం పేర్కొన్నారు. ఆర్కేవిబి.పేట ఛైర్మన్‌గా సాంబశివ ఆచారి ఎన్నికైనట్లు హెచ్‌ఎం తెలిపారు. ఎంఈఓ విజయ్ కుమార్, రవియాదవ్, ఉమా శంకర్, దామోదరం, విక్రమ్, మునిరాజు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లి: కమ్మనపల్లి ఏపీ మోడల్ స్కూల్‌లో పాఠశాల ప్రిన్సిపాల్ అనిత ఆధ్వర్యంలో ఛైర్‌పర్సన్‌గా విజయలక్ష్మీ, వైస్ ఛైర్‌పర్సన్‌గా గజేంద్రను ఎన్నుకున్నారు. టిడిపి మండలాధ్యక్షులు కిషోర్ గౌడు ఎన్నికైన వారిని శాలువతో సన్మానించారు.


సదుం: హెడ్ క్వార్టర్స్‌లోని జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఎస్‌ఎంసి ఎన్నికలో ఛైర్మన్‌గా సి.పవన్ కుమార్, వైస్ ఛైర్‌పర్సన్‌గా ఎస్.యాస్మిన్‌ను ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు పాఠశాల ప్రదానోపాధ్యాయులు జయకుమార్ రెడ్డి తెలిపారు. మండల తహశీల్దార్ మారూఫ్ హుస్సేన్, ఎంఈఓ 2 దామోదరం, సదుం ఎస్సై షేక్‌షావల్లి, పంచాయతీ ఈఓ హసీనా, ఉపాధ్యాయుడు సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.



పలమనేరులో..

విజయపురం: మండలంలో ఎస్‌ఎంసీ (స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ) ఎన్నికలు సజావుగా జరిగింది. మొత్తం 54 ప్రభుత్వం పాఠశాలలో గురువారం ఎన్నికలు జరిగింది. ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగిన ఎన్నికలలో విద్యార్ధుల తల్లిదండ్రులు స్వచ్ఛందంగా పాల్గొని ఓటు హక్కు వినియోగించుకొన్నారు. రెండు గంటలకు నూతనంగా ఎన్నికైన ఎస్‌ఎంసీ ఛైర్మన్, వైస్ ఛైర్మన్, కమిటీ సభ్యులతో కమిటీ సమావేశం ఏర్పాటు నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు.

ఐరాల: మండలంలోని 7 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, 4 ఎంపీయుపి పాఠశాలలు, 54 ఎంపీపీ పాఠశాలలో గురువారం పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. మండలంలోని పాఠశాల కమిటీ ఎన్నికలకు ఎంపీడీవో వెంకటేశులు, తహసిల్దార్ మహేష్ కుమార్ వీఆర్వో, విఆర్ఎ, సచివాలయ సిబ్బందిని పరిశీలకులుగా నియమించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు అరుణ్ కుమార్, శాంతకుమారి, కోమల, నరేంద్ర రెడ్డి, లక్ష్మణ్ బాబు, చంద్రశేఖర్ నాయుడు, పురుషోత్తం, అజిత, ఉషారాణి, లక్ష్మీదేవి, భానుశేఖర్ నాయుడు పాల్గొన్నారు.



శాంతిపురంలో..

రామకుప్పం: మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో ఛైర్మన్లు ఎన్నిక ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి దేవరాజులు ననియాల పాఠశాలలో ఎన్నికల సరళిని పరిశీలించారు. స్కూల్ కమిటీ ఎన్నుకోవడం ప్రశాంతంగా జరుపుకోవడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం స్కూల్ ఛైర్మన్‌గా గజేంద్రను ఎన్నుకున్నారు. అలాగే మండల కేంద్రంలోని బాలికోన్నత పాఠశాలలో ఛైర్మన్ గ కేశవరెడ్డి, వైస్ ఛైర్మన్ ఆనంద్, బాలుర పాఠశాలలో ఛైర్మన్ శ్రీరాములు, వైస్ ఛైర్మన్ లక్ష్మీనారాయణ, బందార్లపల్లి పంచాయతీ ఏపీ మోడల్ స్కూల్‌లో ఛైర్మన్ బాల సుబ్రహ్మణ్యం, కెంపసముద్రం, అయ్యప్ప గాని పల్లిలో శంకరప్ప, స్వప్న లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

శాంతిపురం: మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలలో ప్రశాంత వాతావరణంలో పాఠశాల కమిటీ ఎన్నికలు జరిగాయి. పాఠశాల కమిటీ ఎన్నికలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సజావుగా జరిగినట్లు మండల విద్యాశాఖ అధికారి తెలిపారు. ఏపీ మోడల్ స్కూల్ తుమిసి పాఠశాల ఛైర్మన్‌గా సి.వెంకటాచలపతి, వైస్ ఛైర్మన్‌గా రూపమ్మ, రాళ్ళబూదుగూరు ప్రభుత్వం పాఠశాల కమిటీ ఛైర్మన్‌గా శేషాద్రిపురానికి చెందిన ప్రకాష్, వైస్ ఛైర్మన్‌గా రాళ్ళబూదుగూరు గ్రామానికి చెందిన ప్రభావతి మంజునాథ్ ఎన్నుకోబడ్డారు. రాళ్ళబూదుగూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఛైర్మన్‌గా వి.పురుషోత్తం, వైస్ ఛైర్మన్‌గా అల్లు, చిన్నారిదొడ్డి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఛైర్మన్‌గా అమరావతి, వైస్ ఛైర్మన్‌గా రూప, కొత్తపేట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఛైర్మన్‌గా ఎం.మంజునాథ్, వైస్ ఛైర్మన్‌గా లక్ష్మీదేవి, ఎస్.గొల్లపల్లి ప్రాథమిక పాఠశాల ఛైర్మన్‌గా సంధ్య, వైస్ ఛైర్మన్‌గా నాగమణి ఎన్నుకోబడ్డారు.



సోమలలో..

సోమల: మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ప్రాథమికోన్నత పాఠశాలలు ప్రాథమిక పాఠశాలలో గురువారం పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలను ప్రధాన ఉపాధ్యాయులు ఉపాధ్యాయ బృందం ఆధ్వర్యంలో నిర్వహించారు. పాఠశాలల్లో చదివే విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలకు పిలిపించి యాజమాన్య కమిటీ విధివిధానాలను వారికి వివరించి ఎన్నికలు నిర్వహించారు. ఛైర్మన్, వైస్‌ఛైర్మన్ కమిటీ మెంబర్లను ఎన్నుకున్నారు. ఎన్నికల పర్యవేక్షణను మండల విద్యాశాఖ అధికారిని శివ రత్నమ్మ నిర్వహించారు.



ఐరాలలో..

పలమనేరు: పాఠశాలల అభివృద్ధికి విద్యా కమిటీ సభ్యులు తోడ్పడాలని పలమనేరు శాసనసభ్యులు ఎన్.అమరనాథ రెడ్డి పేర్కొన్నారు. ఆ మేరకు కొత్తగా ఏర్పాటు అయిన పాఠశాల విద్యా కమిటీ సభ్యులు గురువారం సాయంత్రం స్థానిక పంచాయతీరాజ్ అతిథి గృహంలో ఆయన్ను కలిసి సన్మానించారు.

భూ సమస్యలు పరిష్కరించండి: తహశీల్దారు

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని భూ సమస్యలు వెంటనే పరిష్కరించాలని విఆర్‌వోలను తహశీల్దారు ఐ సుబ్రహ్మణ్యం ఆదేశించారు. గురువారం తహశీల్దారు కార్యాలయంలో నిర్వహించిన విఆర్‌వోల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించి సర్టిఫికెట్లు సకాలంలో అందించాలన్నారు. కార్యాలయం చుట్టూ ప్రజలు తిప్పకుండా వీఆర్‌వోలు వారికి సేవలు అందించాలని, గ్రామ సచివాలయాల్లో అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు చంద్రబాబు నాయుడు, సీనియర్ అసిస్టెంట్ నాగరాజురెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్లు కిరణ్ కుమార్, గురునాథ్ పాల్గొన్నారు.

బిసి వసతి గృహంలో తల్లిదండ్రుల సమావేశం

ప్రజాశక్తి -బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని బీసీ సంక్షేమ వసతి గృహం అధికారి ఎస్ రామయ్య ఆధ్వర్యంలో గురువారం తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వసతి గృహాధికారి రామయ్య మాట్లాడుతూ విద్యార్థుల విద్యపై తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలన్నారు. విద్యార్థుల విద్యపై వసతి గృహ అధికారి, సిబ్బంది అందుబాటులో వుండి ఆహారం, ఆరోగ్యం పట్ల జాగ్రత్తలు తీసుకుంటామని, పిల్లలు వారి ఇంటి వద్దకు వచ్చినప్పుడు తల్లిదండ్రులు అదే బాధ్యత వహించాలన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం, రుచికర భోజనం వడ్డించాలన్నారు. ట్యూటర్స్ ద్వారా వారికి విద్యను బోధిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ వసతి గృహ సిబ్బంది హైమావతి, చెంగయ్య, చంద్రమ్మ, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆదివాసి గిరిజన దినోత్సవాన్ని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : ప్రపంచ ఆదివాసి గిరిజన దినోత్సవం సందర్భంగా ఈ నెల 9వ తేదీ తిరుపతిలో నిర్వహించనున్న బహిరంగ సమావేశాన్ని జయప్రదం చేయాలని చిత్తూరు పార్లమెంటరీ ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎం చెంచయ్య పేర్కొన్నారు. తిరుపతి పట్నంలో గిరిజన భవనంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రపంచ ఆదివాసి దినోత్సవంను వైభవంగా నిర్వహిస్తారని, నగరి నియోజకవర్గం, పుత్తూరు మున్సిపాల్టీ, గ్రామాల గిరిజనులు సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమించారని ఫిర్యాదు

ప్రజాశక్తి - డక్కిలి: మండలంలోని మోపూరు రోడ్డు ప్రాంతంలో ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించారని ఏపీ ప్రజాసంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు గద్దల మునెయ్య ఆధ్వర్యంలో తహశీల్దారు కార్యాలయంలో రెవెన్యూ అధికారులకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఆ స్థలాన్ని అంబేద్కర్ విజ్ఞాన మందిరం కోసం మంజూరు చేయాలని రెవెన్యూ అధికారులను తాము కోరామని, అప్పట్లో ఎన్నికల కోడ్ కారణంగా అధికారులు స్థలాన్ని కేటాయించలేదని తెలిపారు. తాజాగా ఆ స్థలాన్ని తమిళనాడుకు చెందిన కొందరు వ్యక్తులు ఆక్రమించేందుకు రాళ్లు నాటారని, అధికారులు విచారణ చేపట్టి ఆక్రమణలు తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు కూలి సంఘం నాయకుడు దందాల కిష్టయ్య, మాల మహానాడు నాయకుడు రవి, నాన్నం మునెయ్య, ఎంఆర్‌పిఎస్ నాయకుడు కృష్ణయ్య, ఎరుకల హక్కుల పోరాట సమితి నాయకుడు బి రవి పాల్గొన్నారు.

బురదనీరు..నడిచేది ఎలా?

ప్రమాదకరంగా రహదారి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: పట్టణంలోని 14వ వార్డు షాపు వీధి ఎక్స్‌టెన్షన్ చివరిలో వర్షం పడితే రోడ్డు బురదమయంగా మారుతోంది. బురద ఎక్కువగా వుండడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. గుట్టపై నుంచి వచ్చే వర్షపు నీరు ఇలా నివాసాల మధ్య, రహదారిపై చేరి బురదమయంగా మారుతోంది. రోడ్డుపై బురదనీరు నిండి పోవడంతో దోమలు చేరి ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు పక్కనే కొత్తగా ఇళ్లు నిర్మాణాలు కొన సాగుతున్నాయి. అయినా ఇటు నుండి అటు వైపునకు వెళ్లాలంటే ఇబ్బందులకు గురి అవుతున్నామని, కాలు జారితే ప్రమాదాల బారిన పడాల్సి వస్తుందని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మురుగు నీరు చేరడం వల్ల దోమలు చేరి విష జ్వరాలు, టైఫాయిడ్, మలేరియా వంటి విష జ్వరాలు ప్రబలే ప్రమాదం వుందని, సంబంధిత అధికారులు వెంటనే పరిశీలించి రోడ్డుపై బురదనీరు, మురుగునీరు చేరకుండా చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ప్రజలు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తామని స్థానికులు హెచ్చరించారు.

అధికారులు వివరణ

ఈ విషయం ఇంతవరకు మా దృష్టికి రాలేదు. దీనిపై తగు చర్యలు తీసుకుంటాం..

- కెఎల్‌ఎం రెడ్డి, పుత్తూరు మున్సిపాల్టీ, పుత్తూరు.

ఉత్తమ విద్యతో మంచి ఉద్యోగం పొందాలి

సిద్ధార్థ కళాశాల ఛైర్మన్ అశోక్ రాజు



మాట్లాడుతున్న అశోక్‌రాజు

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: ఉత్తమ విద్యతో మంచి ఉద్యోగం పొందాలని సిద్ధార్ధ కళాశాల ఛైర్మన్ అశోక్ రాజు పేర్కొన్నారు. నారాయణవనం మండల పరిధిలోని సిద్ధార్థ కళాశాలలో 2024 -25 విద్య సంవత్సరంలో బీటెక్ మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థులకు కళాశాల ఆడిటోరియంలో ఓరియెంటేషన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఛైర్మన్ మాటాడుతూ విద్యార్థులు వారి తల్లిదండ్రు లకు ధన్యవాదాలు తెలిపారు. విద్యార్థులు సిద్ధార్థ కళాశాలను ఎంపిక చేసుకున్నందుకు సెల్ఫ్ కాన్ఫిడెన్స్‌లో పట్టుదలతో కృషిచేసి నాలుగు సంవత్సరాలు మంచి విద్యను నేర్చుకొని ఉత్తమ ఉద్యోగాన్ని సంపాదించి తల్లిదండ్రుల కలలను నెరవేర్చాలన్నారు. ఇంజనీరింగ్ లో బ్రాంచ్ ఏదైనా దాన్ని ఇష్టపడి చదివి సర్టికల్ లో నిష్ణాతులుగా తయారై పారిశ్రామిక వ్యక్తులుగా ఎదిగి పది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే దిశగా పయనించాలని కోరారు. పేదవారిగా ఉండి పైకి ఎదిగిన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం, యాపిల్ కంపెనీ యజమాని స్టీల్ జాబ్‌ను ఆదర్శంగా తీసుకొని కృషి చేయాలని కోరారు. తల్లిదండ్రులు ప్రతినెలా కళాశాల హెచ్‌ఓడిని కౌన్సిలర్ , క్లాస్ టీచర్లను కలిసి తమ పిల్లల ప్రోగ్రెస్ చూసుకుని పిల్లల భవిష్యత్‌పై శ్రద్ధ తీసు కోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ సుప్రజ, ప్రిన్సిపల్ చంద్రశేఖర్ రెడ్డి, జనార్ధన రాజు, రమేష్, హెచ్ ఓడిలు, అధ్యాపకులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితులను ఆదుకుంటాం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పిచ్చాటూరు, వరదయ్యపాళ్యం: భాకరాపేట ఘాట్ వద్ద ధాన్యం లారీ బోల్తా పడిన ఘటనలో వరదయ్యపాలెం మండలం కళత్తూరుకు చెందిన నవీన్ (28) మృతి చెందగా, అదే గ్రామానికి చెందిన మరో ఆరుగురు కూలీలు తీవ్ర గాయాలై తిరుపతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. సమాచారం అందుకున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం గురువారం ఉదయం డిఎంఅండ్‌హెచ్‌ఓ శ్రీహరితో కలిసి రుయాస్పత్రికి చేరుకొని గాయపడిన మల్లికార్జునయ్య, శేఖర్, మణిభూషణ్, వెంకటేష్, మణి, బాలయ్యలను పరామర్శించారు. ఇందులో మల్లికార్జునయ్య పరిస్థితి విషమంగా ఉండటం తో మెరుగైన వైద్యం అందిం చాలని ఎమ్మెల్యే రుయా వైద్యాధి కారులు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడు తూ మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం అన్నీ విధాలా ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని, క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందిస్తామని భరోసా కల్పించారు.



నవీన్ పరిస్థితిని తెలుసుకుంటున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

డిపో మేనేజర్ నిర్లక్ష్య వైఖరి వీడాలి: ఎన్ఎంయూ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : ఆర్టీసీ కార్మికుల పట్ల డిపో మేనేజర్లు నిర్లక్ష్యంగా ఉన్నారని అసభ్య పదజాలంతో దూషిస్తున్నారని ఉన్నతాధికారులు ఇలాంటి సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడతామని నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ స్టేట్ సెక్రటరీ చెంచులయ్య హెచ్చరించారు. గూడూరు ఆర్టీసీ డిపో ఎదుట ఎన్ఎంయు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భం గా యూనియన్ స్టేట్ సెక్రటరీ చెంచులయ్య మాట్లాడుతూ కార్మికుల పట్ల డిపో మేనేజర్లు నిర్లక్ష్యంగా ఉన్నారని మహిళలకు నెలలో మూడు రోజుల సెలవు ఇవ్వడం లేదని సమస్యలపై మాట్లాడడానికి వెళ్లిన కార్మికులపై దురుసుగా మాట్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల పట్ల డిపో మేనేజర్లు స్నేహపూర్వకంగా వ్యవహరించాలని ఉన్నతాధికారులు స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో శేఖర్, వెంకయ్య, శ్రావణ్, ఎస్ కే బాష, ప్రవీణ్ పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల వ్యవస్థ పునరుద్ధరణపై హర్షం

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గత వైసిపి ప్రభుత్వంలో రేషన్ డీలర్ల వ్యవస్థ నిర్వీర్యం అయిన రేషన్ డీలర్ వ్యవస్థను ముఖ్యమంత్రి చంద్రబాబు మళ్లీ పునరుద్ధరించడం సంతోషంగా ఉందని గూడూరు రేషన్ డీలర్ల అసోసియేషన్ నిర్వాహకులు రవి తెలిపారు. గూడూరు పట్టణంలో రేషన్ డీలర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో డీలర్లు ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్రపటానికి పాలాబిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నిర్వాహకులు రవి మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ఉన్నప్పుడు రేషన్ డీలర్లకు కమీషన్ పెంచారని ఆ తరువాత వచ్చిన వైసిపి ప్రభుత్వం రేషన్ డీలర్ వ్యవస్థను తొలగించి వాహనాలను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. మళ్లీ ప్రస్తుతం చంద్రబాబు రేషన్ డీలర్ వ్యవస్థను పునరుద్ధరించినందుకు అసోసియేషన్ తరపున ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు .



ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే చిత్ర పటాలకు పాలాభిషేకం చేస్తున్న డీలర్లు

స్టేషన్ కన్సల్టేటీవ్ కమిటీ మెంబరుగా కోటకొండ బాబు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ :

పుత్తూరు రైల్వే స్టేషన్ మాస్టర్ పంకజ్ నాయక్ చేతుల మీదుగా కోటకొండ బాబుకు మెంబర్ అఫ్ స్టేషన్ కన్సల్టేటీవ్ కమిటీ చెన్నై డివిజన్ సౌతర్న్ రైల్వే అర్హత కలిగిన మెంబర్ కార్డు అందించారు. ఈ మెంబర్ షిప్ రావడానికి కృషి చేసిన బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి, చిత్తూరు జిల్లా బిజెపి అధ్యక్షులు జగదీష్ నాయుడు, రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు చిలకం ఈశ్వర్ రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నేడు కేంద్ర ప్రభుత్వ ఆఫీసుల వద్ద ధర్నాలు

ప్రజాశక్తి -తిరుపతి డెస్క్: క్విట్ కార్పొరేట్స్ అనే నినాదంతో ఈ నెల 9వ తేదీ శుక్రవారం ఉదయం సిఐటియు, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం పిలుపు మేరకు కేంద్ర ప్రభుత్వ ఆఫీసుల వద్ద నిర్వహించనున్న ధర్నాలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జి బాలసుబ్రమణ్యం పిలుపునిచ్చారు. గురువారం ఆయన మాట్లాడుతూ నిర్వహించాలని జిల్లా అంతటా నిర్వహించే ఈ ధర్నాలో భాగంగా తిరుపతి బిఎస్ఎన్ఎల్ ఆఫీస్ వద్ద ఉదయం 10 గంటలకు ధర్నా నిర్వహించనున్నారని అందరూ సహకరించి ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

తిరుమలకు ప్రవాస ఆంధ్రుల పాదయాత్ర

ప్రజాశక్తి -రామచంద్రాపురం(చంద్రగిరి):

ఈ ఏడాది నిర్వహించిన సార్వత్రిక ఎన్నికలలో భాగంగా చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాలని అప్పుడే ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని బెంగుళూరు చిక్కల్ సంద్ర అబ్బయ్య నాయుడు పేర్కొన్నారు. స్టూడియోలో స్థిరపడిన ఆంధ్రులు తిరుమలకు కాలినడకన చేరుకుని దర్శనం చేసుకుంటామని మొక్కుకున్నారు. ఆంధ్ర రాష్ట్రంలో అత్యధిక సీట్లు సాధించి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేయడంతో మొక్కులు చెల్లించుకునేందుకు కాలినడకన బెంగళూరు చిక్కల్ సంద్ర అబ్బయ్య నాయుడు స్టూడియోలో స్థిరపడిన 58 మంది ఆంధ్రులు గత శుక్రవారం బయలు దేరారు. గురువారం ఏడు రోజులుగా వీరి ప్రయాణం కొనసాగుతోంది. మా మండూరు సమీపంలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పాదచారులతో కలిసి మాట్లాడారు. నడక మార్గంలో , తిరుమల కొండపై ఎలాంటి అవసరం ఉన్నా ఫోను చేయాలని ఎమ్మెల్యే తెలిపారు.



ఎస్‌వియూ గణిత శాస్త్ర విభాగాధిపతి జయసుబ్బారెడ్డిని సన్మానిస్తున్న ఉద్యోగులు

ఎస్వీయూ గణిత శాస్త్ర విభాగాధిపతిగా జయసుబ్బారెడ్డి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం గణిత శాస్త్ర విభాగాధిపతిగా ఆచార్య సి జయ సుబ్బారెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు పరిపాలన భవనం నుంచి ఉత్తర్వులు అందాయి. గురువారం విభాగాధిపతి చాంబర్లో ఆయన ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆచార్య జయ సుబ్బారెడ్డిని గణిత శాస్త్ర విభాగం ఆచార్యులు, పరిశోధకులు అకడమిక్ కన్సల్టెంట్లు పూలమాల, శాలువాతో సత్కరించారు. టీచింగ్, నాన్ టీచింగ్, యూనివర్సిటీలోని పలువురు ఆచార్యులు, సిబ్బంది, పరిశోధకులు గణిత శాస్త్ర విభాగాధిపతిగా నియమితులైన జయ సుబ్బారెడ్డిని పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు. ఉద్యోగ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా ఆచార్య జయ సుబ్బారెడ్డి మాట్లాడుతూ వర్సిటీలో గణిత శాస్త్ర విభాగ అభివృద్ధి కోసం అధ్యాపకులు, అకడమిక్ కన్సల్టెంట్లు, పరిశోధకులు, విద్యార్థులు బోధనేతర సిబ్బంది అందరి సహకారంతో కృషి చేస్తానన్నారు. విద్యార్థులు చక్కగా తరగతులకు హాజరై గణిత శాస్త్రంలోని వివిధ స్పెషలైజేషన్లలో సబ్జెక్టులలో పట్టు సాధించి ఉన్నత రంగాల్లో రాణించేందుకు కృషి చేయాలన్నారు. విభాగం తరపున ప్రత్యేకంగా క్యాంపస్ ప్లేస్మెంట్లు నిర్వహించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ అవకాశం ఇచ్చిన ఉన్నతాధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

వెంకటగిరిలో త్వరలో డయాలసిస్ కేంద్రం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-వెంకటగిరి: వెంకటగిరి ప్రభుత్వ ఆస్పత్రిలో త్వరలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేస్తామని స్థానిక ఎమ్మెల్యే కురుగొండ రామకృష్ణ తెలిపారు. గురువారం ఆయన స్థానిక ప్రభుత్వాస్పత్రిలో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్య సేవలను రోగులను అడిగి తెలుసుకున్నారు. రికార్డులు పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారన్నారు. ఆస్పత్రిలో నాణ్యమైన ఖరీదైన మందులను సైతం అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. రూ.50 వేలు విలువ చేసే ఇంజక్షన్లు సైతం ఆస్పత్రిలో ఉచితంగా అందిస్తున్నట్లు తెలిపారు. ఆస్పత్రిలో వైద్యులు సిబ్బంది అందుబాటులో ఉండాలని విధులకు సక్రమంగా హాజరు కాని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి జిలానీ, సిబ్బంది, టిడిపి నాయకులు జి నాగేశ్వరరావు , కేవీకే ప్రసాద్, పి రాజేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్‌టిసి బస్సులు ప్రారంభించిన ఎమ్మెల్యే

వెంకటగిరి నుండి తిరుపతికి కొత్తగా ఏర్పాటు చేసిన ఆర్‌టిసి బస్సులను ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ గురువారం ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి నెల్లూరుకు వెళ్లే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అదనంగా కొత్త బస్సులను ఏర్పాటు చేస్తున్నామన్నారు.



ఆస్పత్రిలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణ

శ్రీసిటీలో మెగా రక్తదాన శిబిరం




ప్రజాశక్తి -వరదయ్యపాలెం

శ్రీసిటీ 16వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం శ్రీసిటీలోని మూడు వేర్వేరు ప్రదేశాల్లో రక్తదాన శిబిరం నిర్వహించారు. సెంట్రల్ జీఎస్టీ కమిషనరేట్, శ్రీసిటీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక ట్రేడ్ సెంటర్, బిజినెస్ సెంటర్, ఈఎంసి కేంద్రం వద్ద శిబిరాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో యాక్సలెంట్ ఫార్మా, బ్రేక్స్ ఇండియా, ఇసుజు, నిట్టాన్ ఇండియా, రాకవర్త్, వెర్మీరిన్, టిల్, ఈ-ప్యాక్ సహా 40 పరిశ్రమల ఉద్యోగులు, సూళ్లూరుపేట గోకుల కష్ణ ఇంజనీరింగ్, సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థులు మొత్తంగా 500 మందికి పైగా రక్తదానం చేశారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, ప్రాణాలను రక్షించే కీలక ప్రక్రియ అయిన రక్తదానంలో భాగస్వాములు కావడానికి ముందుకు వచ్చిన రక్త దాతలకు, మంచి కార్యక్రమానికి చొరవ చూపిన జీఎస్టీ కమిషనరేట్ అధికారులకు అభినందనలు తెలిపారు. శ్రీసిటీ 16వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టిన ఈ కార్యక్రమానికి మంచి స్పందన రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. నెల్లూరు జీఎస్టీ కమిషనరేట్ సూపరింటెండెంట్ సునీల్ గౌతమ్ మాట్లాడుతూ రక్తదాన శిబిరం విజయవంతం చేసేందుకు కృషి చేసిన శ్రీసిటీ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. తిరుపతి, నెల్లూరు రెడ్ క్రాస్ సొసైటీ, తిరుపతి ఎన్ టి ఆర్ ట్రస్ట్ కు చెందిన సిబ్బంది ఆధ్వర్యంలో సాగిన శిబిరంలో శ్రీసిటీ ఫౌండేషన్ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ (కస్టమర్ రిలేషన్స్) రమేష్ కుమార్, సీఎస్సార్ మేనేజర్ నిరీషా సన్నారెడ్డి, హెచ్ ఆర్ ప్రతినిధి వి.శివకుమార్ రెడ్డి, శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజర్ సురేంద్ర కుమార్ పాల్గొన్నారు.

ఒబెరాయ్ హోటల్ నిర్మాణానికి స్థల పరిశీలన

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

పర్యాటక కార్పొరేషన్ ట్రాన్స్పోర్ట్ కార్యాలయం సమీపంలోని దేవ్ లోక్ నందు ఒబెరాయ్ హోటల్ నిర్మాణానికి సంబంధించిన స్థలాన్ని కలెక్టర్ డా.ఎస్. వెంకటేశ్వర్ పరిశీలించారు. తిరుపతి జిల్లాలో పర్యాటక రంగ అభివద్ధికి, ఆతిథ్య రంగ అభివద్ధికి అనేక అవకాశాలు ఉన్నాయని, తద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయని పేర్కొన్నారు. గురువారం ఉదయం స్థానిక పర్యాటక కార్పొరేషన్ ట్రాన్స్పోర్ట్ ఆఫీస్ సమీపంలోని దేవ్ లోక్ నందు ఒబెరాయ్ హొటల్ నిర్మాణానికి కేటాయించిన 20 ఎకరాల స్థలాన్ని జిల్లా కలెక్టర్ సంబంధిత రెవెన్యూ, పర్యాటక శాఖ అధికారులతో కలిసి పరిశీలించి మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో తిరుమల ఏడు కొండల స్వామి వారు, జ్ఞాన ప్రసూనాంబా సమేత శ్రీ కాళహస్తీశ్వర స్వామి ఆలయం తదితర పుణ్య క్షేత్రాలు, తూపిలి పాలెం బీచ్, ఇరకం దీవులు, తలకోన తదితర అద్భుతమైన పర్యాటక ప్రదేశాలు ఉన్నాయని, తిరుపతి జిల్లా వైద్య హబ్ గా, ఉన్నత విద్యా సంస్థలు కలిగి విద్యా హబ్ గా, పారిశ్రామిక సెజ్ లు కలిగి పరిశ్రమల హబ్ గా, రైల్, రోడ్డు, విమానాశ్రయ సదుపాయాలు కలిగి ఆతిథ్య రంగ అభివద్ధికి అనేక అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ప్రతి రోజూ ప్రపంచ నలు మూలల నుండి తిరుపతి జిల్లాలో సుమారు 75 వేల నుండి లక్ష మంది దాకా పర్యాటకులు, విద్యార్థులు, ప్రజలు విచ్చేస్తుంటారు అని, ఈ నేపథ్యంలో ఒబెరాయ్ వంటి సెవెన్ స్టార్, హయత్ వంటి ప్రముఖ హొటళ్లు జిల్లాలో నెలకొల్పడం ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. ఈకార్యక్రమంలో జూ క్యూరేటర్ సెల్వం, ఆర్డీఓ నిషాంత్ రెడ్డి , జిల్లా పర్యాటక శాఖ అధికారి రూపెంద్ర నాథ్ పాల్గొన్నారు.



మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

సచివాలయ సిబ్బందికి కమిషనర్ దిశానిర్దేశం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

ప్రజల పట్ల జవాబుదారీతనంతో విధులు నిర్వహించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య సచివాలయ సిబ్బందిని హెచ్చరించారు. నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న అమెనిటీ సెక్రటరీలు, శానిటరీ సెక్రటరీలు, టౌన్ ప్లానింగ్ సెక్రటరీ, హెల్త్ సెక్రటరీలతో పాటు ఆయా విభాగాల అధిపతులతో గురువారం కచ్చపి ఆడిటోరియంలో కమిషనర్ సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ మీకు కేటాయించిన విధులను బాధ్యతతో సక్రమంగా నిర్వహించాలని అన్నారు. అన్ని విభాగాల సెక్రటరీ లు కలసి మెలసి విధులు నిర్వహించాలని, ఇది తనది కాదు అంటూ నిర్లక్ష్యం వహించారాదని అన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సచివాలయ సిబ్బంది ప్రతి రోజు ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని అన్నారు. ప్రతి రోజూ ఇంటింటికీ వాహనాలు వెళ్లి చెత్త సేకరణ జరిగేలా శానిటరీ సెక్రీటరీలు పర్యవేక్షించాలని అన్నారు. వీధుల్లో, రోడ్ల పైన ఎక్కడా చెత్త వేయకుండా, పరిసరాలు శుభ్రంగా ఉండేలా కిందిస్థాయి సిబ్బంది సమన్వయం చేసుకుని శుభ్రం చేయించాలని అన్నారు. టౌన్ ప్లానింగ్ విభాగపు అధికారులు, సిబ్బంది నగరంలో ఎక్కడా భవన నిర్మాణ వ్యర్థాలు లేకుండా చూడాలని, అనధికారిక నిర్మాణాలు, ఫ్లెక్సీలు, హొర్డింగులు లేకుండా చూడాలని అన్నారు. భవన నిర్మాణాలకు అన్ని అనుమతులు నిర్దిష్ట సమయంలో అందజేయాలని అన్నారు. నగర శుభ్రత, ప్రజా సంక్షేమమే మన ధ్యేయమని, మనం ముందడుగు వేస్తే ప్రజలు కూడా మన వెంట నడుస్తారని ఆ దిశగా అందరు అధికారులు కషి చేయాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డెప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్ వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.

